RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in


Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 26 జూన్ 2026 శుక్రవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:24

# ఈ రోజు చరిత్రలో నిలిచిపోతుంది








కర్ణాటకలోని మునీరాబాద్ బహిరంగసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ఇది 33 గేట్ల పునరుద్ధరణ కార్యక్రమం కాదు...

మూడు తరాల సమస్యను పరిష్కరించే కార్యక్రమం

లక్షలాది మంది రైతుల సమస్యలను ఈ గేట్ల పునరుద్ధరణ పరిష్కరించబోతోంది

సీఆర్ పాటిల్ కేంద్ర జలశక్తి మంత్రి మూడు రాష్ట్రాల సాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కరిస్తారని నమ్ముతున్నా

గద్వాల, అలంపూర్, పాలమూరు జిల్లా ప్రాంతంలో రాజోలిబండ డైవర్షన్ స్కీం (=ఙూ) కు కేటాయించిన 17.9 టీఎంసీల నీళ్లలో కేవలం 5 నుంచి 6 టీఎంసీలే మా రైతాంగం వాడుకుంటోంది

దాదాపు 10 టీఎంసీల నీళ్లు మాకు రావడంలేదు

తుంగభద్రలో మట్టి పేరుకుపోవడం, నీటి కేటాయింపుల సమస్యను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లాం

నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సమావేశంలో నిర్ణయించుకున్నాం

కచ్చితంగా ఈరోజు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుంది

పంచాయితీ కావాలా సమస్య పరిష్కారం కావాలా అంటే నేను పరిష్కారమే కోరుకుంటా

రాజకీయాలకు అతీతంగా తుంగభద్ర నదీ ఒడ్డున జరిగిన చర్చలు గొప్ప నిర్ణయంగా మారబోతోంది

అంతర్రాష్ట్ర జల వివాదాలకు ఇది శాశ్వత పరిష్కారం చూపుతుందని నమ్ముతున్నా

మైసూరు రాజులే రైతుల కోసం యుద్ధాన్ని వీడి పరిష్కారం కోసం ముందుకొచ్చారు.

రైతులకోసం రాజకీయాలకు అతీతంగా ముందుకు నడవాల్సిన బాధ్యత అందరిపై ఉంది

త్వరలోనే కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ గారు పరిష్కారం చూపిస్తారని ఆశిస్తున్నా

ఇందుకు తుంగభద్ర సమావేశంతో మొదటి అడుగు పడిందని భావిస్తున్నా

## ఈ నెల 27న భద్రాచలం దేవస్థానం అభివృద్ధి పనులకు శ్రీకారం

**ఆగమశాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి పనులు**

**యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి**

**అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం**


వార్తా 2 లో



అధికారిక పర్యటనలో భాగంగా హైదరాబాద్ వచ్చిన మేఘాలయా ముఖ్యమంత్రి సీ.కే. సంగ్మా.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ కు వచ్చిన మేఘాలయా ముఖ్యమంత్రి సంగ్మాను శాలువాతో సత్కరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.

## ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్న మంత్రి సీతక్క


వార్తా 9 లో

## ప్రభుత్వ ఉద్యోగులకు 'ప్రజా ప్రభుత్వం' బంపర్ ఆఫర్

**ఒక్క రూపాయి భారం లేకుండా రూ కోటి 25 లక్షల ఉచిత ప్రమాద బీమా**

**విమాన ప్రమాదమైతే రూ. 2 కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు రక్షణ**

**కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికీ వర్తింపు**

**దేశ చరిత్రలోనే తొలిసారిఒకటో తేదీనే జీతాలు..**

**త్వరలోనే 'క్యాష్‌లెస్' హెల్త్ కార్డ్స్,డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

తెలంగాణ రాష్ట్రంలోని లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాల్లో భద్రత, భరోసా కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. గౌరవ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని క్యాబినెట్ ఉద్యోగుల సంక్షేమం కోసం దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా సరికొత్త ఉచిత బీమా పథకాన్ని ఆమోదించిందని ఆయన వెల్లడించారు. ఈ పథకం ద్వారా అటు ప్రభుత్వంపై కానీ, ఇటు ఉద్యోగులపై కానీ ఒక్క రూపాయి కూడా అదనపు భారం పడకుండా, బ్యాంకులతో మాట్లాడి ఈ భారీ బీమా రక్షణను కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు.



మిగతా 2 లో

## ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఛాత్రోన్ కి గూంజ్" కార్యక్రమం






నేటి విద్యార్థుల ఆలోచనలే రేపటి భారతదేశానికి మార్గదర్శకమని ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మోతా రోహిత్ ముదిరాజ్ పేర్కొన్నారు.

నారాయణగూడలో ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఛాత్రోన్ కి గూంజ్"లి కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సామాజిక, విద్యా, సాంకేతిక రంగాలకు సంబంధించిన పలు అంశాలపై తమ వినూత్న ఆలోచనలు, సూచనలు మరియు అభిప్రాయాలను పంచుకున్నారు. నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలు, పరీక్షా వ్యవస్థలో పారదర్శకత, యువత భవిష్యత్తుకు సంబంధించిన అనేక కీలక అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా నేను మాట్లాడుతూ, యువతకు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచే వేదికలను కల్పించడం కాంగ్రెస్ పార్టీ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నాను. విద్యార్థుల్లోనాయకత్వ లక్షణాలు, విశ్లేషణాత్మక దృక్పథం మరియు సమాజ నిర్మాణంపై బాధ్యతమరింత పెరగాలని ఆకాంక్షించాను. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తో పాటు పలువురు సీనియర్ నాయకులు,కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



Intuc జాతీయ నాయకులు సంజీవ రెడ్డి గారిని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానం చేసిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర intuc చీఫ్ వైస్ ప్రెసిడెంట్ మొగుళ్ల రాజిరెడ్డి తదితరులు

ప్రజాబలం

26 జూన్ 2026 శుక్రవారం

# చమురు ధరలు 50 డాలర్ల దిగువకు..?

సుదీర్ఘ కాలంలో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగిన నేపథ్యంలో క్రూడాయిల్ ధరలు విపరీతంగా పెరిగాయి. ఇటీవల అమెరికా- ఇరాన్ ఎట్టకేలకు తాత్కాలిక అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేయగా కాస్త ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టాయి. దీంతో అప్పటినుంచి ముడి చమురు ధరలు భారీగా దిగొస్తున్నాయి. గరిష్ఠ స్థాయిల నుంచి పెద్ద మొత్తంలో పతనమై ప్రస్తుతం 4 నెలల కనిష్ఠ స్థాయిలకు చేరడం ఊరట కలిగిస్తోంది. జూన్ 24న బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 75.45 డాలర్లకు పడిపోయింది. ఇవాళ ఒక్కరోజే 2 శాతానికిపైగా తగ్గింది. భవిష్యత్తులో మరింత తగ్గే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.అమెరికా ఇరాన్ యుద్ధం ఫిబ్రవరి 28న ప్రారంభం కాగా అప్పుడు 70 డాలర్ల స్థాయిలో ఉన్న క్రూడాయిల్ ధర భారీగా పెరుగుతూ వెళ్లింది. ఈ క్రమంలోనే ఒక దశలో ఏకంగా 126 డాలర్ల స్థాయికి ఎగబాకింది. దాదాపు 70 శాతానికిపైగా పెరిగిందని చెప్పొచ్చు. ప్రధానంగా చమురు రవాణాకు కీలకంగా ఉన్న హార్ముజ్ జలసంధి మూతబడటంతో ఈ క్రమంలోనే పలు దేశాల్లో చమురు సంక్షోభం నెలకొంది. పలు దేశాల్లో ఇంధన ధరలు విపరీతంగా పెరిగాయి. తర్వాత మొదట కాల్పుల విరమణ, తర్వాత ఒప్పందం దిశగా అడుగులు పడటంతో చమురు ధర తగ్గుతూ వచ్చింది. ఇప్పుడు డీల్ కుదిరిన తర్వాత మరింత తగ్గుతూ వస్తోంది.అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు ప్రతి బారెల్‌కు 78 డాలర్లకు పడిపోయి.. గత మూడు నెలల కనిష్ట స్థాయిని తాకినా భారత ప్రభుత్వం ధరలు తగ్గించకపోవడంపై సామాజిక మాధ్యమ వేదిక 'రెడ్డిట్ లోని ఇండియన్ స్టాక్ మార్కెట్ ఫోరమ్‌లో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. అంతర్జాతీయంగా ధరలు తగ్గినా భారత్‌లో ఇంధన ధరలను తగ్గించకపోవడంపై నెటిజన్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దేశంలో చమురు ధరలు తగ్గకపోతే ద్రవ్యోల్బణం పెరిగి.. ఆర్థిక వృద్ధి మందగిస్తుందని... ప్రభుత్వం సామాన్యుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదని కొందరు నెటిజన్లు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈ డిబేట్‌లో వినియోగదారులపై పడుతున్న పన్నుల భారం ప్రధానంగా చర్చకు వచ్చింది. ముడిచమురు ధరలు పెరిగినప్పుడు లీటరుకు ఎనిమిది రూపాయల వరకు పెంచిన ప్రభుత్వం... ధరలు తగ్గినప్పుడు మాత్రం ఆ ప్రయోజనాన్ని ప్రజలకు బదిలీ చేయడం లేదని నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివిధ సంక్షేమ పథకాల కోసం మధ్యతరగతి పన్ను చెల్లింపుదారులను ప్రభుత్వం ఏటికేడు పిండేస్తోందని.. 2014 నాటి యూపీఏ ప్రభుత్వ కాలం నాటి వ్యతిరేక పరిస్థితులే ప్రస్తుత ప్రభుత్వంపై కూడా కనిపిస్తున్నాయని కొందరు కామెంట్ చేశారు.మరోవైపు.. అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్ ధరలకు, దేశాలు కొనుగోలు చేసే భౌతిక మార్కెట్ ధరలకు మధ్య వ్యత్యాసం ఉంటుందని కొందరు ఆర్థిక కోణాన్ని విశ్లేషించారు. 2026 మార్చిలో ముడిచమురు ధరలు ఒక్కసారిగా 100 నుండి 110 డాలర్లకు పెరిగినప్పుడు... ఆ భారాన్ని ప్రభుత్వం వినియోగదారులపై పడకుండా కొంతకాలం నియంత్రించిందని ఒక నెటిజన్ గుర్తుచేశారు. ప్రభుత్వం ఇంధన ధరల స్థిరత్వాన్ని కాపాడటం వల్లే భారీ యుద్ధ సమయాల్లో కూడా దేశంలో ధరలు అదుపులో ఉన్నాయని, తక్షణమే ప్రయోజనాలు ఆశించడం సరికాదనే వాదన కూడా వినిపించింది. ఇంధన ధరల నియంత్రణకు గానూ ప్రభుత్వం చేపడుతున్న ఇథనాల్ బ్లెండింగ్ విధానంపైనా రెడ్డిట్ వినియోగదారులు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. చమురు ధరలు ఎంత తగ్గినా.. పెట్రోల్, డీజిల్ పరిమాణాన్ని తగ్గించి దాని స్థానంలో ఇథనాల్‌ను ఎక్కువగా కలుపుతున్నారని నెటిజన్లు ఆరోపించారు. దీనివల్ల సామాన్యుడికి ధరల భారం తగ్గడం లేదని... కేవలం ఇథనాల్ తయారుచేసే బడా వ్యాపారవేత్తలకు, పాలకుల కుటుంబాలకే లాభం చేకూరుతోందంటూ కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఉద్దేశించి కొందరు ఘాటుగా విమర్శలు గుప్పించారు.. ఈ ఇంధన సంక్షోభానికి శాశ్వత పరిష్కారంగా ఈవీ అడాప్టేషన్ వైపు మారడమే ఏకైక మార్గమని కొందరు అభిప్రాయపడగా... అది అంత సులువు కాదని మరికొందరు గణాంకాలతో వివరించారు. భారతదేశంలో ప్రస్తుతం ఉన్న 5 కోట్ల కార్లు, 26 కోట్ల ద్విచక్ర వాహనాలను ఈవీలుగా మార్చాలంటే దేశ విద్యుత్ ఉత్పాదన సామర్థ్యాన్ని మరో 600 నుండి 700 శాతం పెంచాల్సి ఉంటుందని... లేదంటే గ్రిడ్ వ్యవస్థ కుప్పకూలుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏదేమైనా.. అంతర్జాతీయంగా తగ్గిన చమురు ధరల ప్రయోజనం దేశీయంగా సామాన్యుడికి అందడం లేదనేది ఈ మొత్తం చర్చ సారాంశం.ముడి చమురు ధర సమీప భవిష్యత్తులో మరింత తగ్గుతుందని భావిస్తుండగా, ఇది భారత్‌పై దిగుమతుల భారం తగ్గేలా చేస్తుంది. ధరలు నిరంతరాయంగా తగ్గుతుండటంతో, క్రూడాయిల్ బ్యారెల్‌కు 50 డాలర్ల కంటే కిందికి పడిపోతుందా అనే చర్చ తెరపైకి వచ్చింది. అయితే, సమీప భవిష్యత్తులో ధరలు అంతగా పడిపోయే అవకాశం లేదని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతానికి మార్కెట్ కేవలం భౌగోళిక రాజకీయాల నుంచి డిమాండ్-సప్లై సమీకరణాల వైపు మళ్లుతోంది. బ్రెంట్ క్రూడ్ రాబోయే రోజుల్లో 65 నుంచి 75 డాలర్ల పరిధిలో కదలాడవచ్చు. ధరలు 50 డాలర్ల దిగువకు వెళ్లాలంటే చైనా లాంటి పెద్ద దేశాల్లో డిమాండ్ దారుణంగా పడిపోవాలి, లేదా అంతర్జాతీయంగా చమురు నిల్వలు విపరీతంగా పేరుకుపోవాలి. ప్రస్తుతానికైతే అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు.ఈ క్రమంలోనే రూపాయి విలువ పుంజుకోవడం సహా ద్రవ్యోల్బణం భయాలు కూడా తగ్గుముఖం పడతాయి. యుద్ధం ప్రారంభం నాటి నుంచి గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న చమురు నౌకలు/ట్యాంకర్లు ఇప్పుడు హార్ముజ్ జలసంధిగుండా రాకపోకలు ప్రారంభించాయి. ఇది మరింత సానుకూల పరిణామాల్ని తీసుకొచ్చింది. మరోవైపు ఇరాన్‌పై ఇన్ని రోజులు ఉన్న ఆంక్షల్ని కూడా అమెరికా సడలించింది. ఇరాన్ చమురు క్రయవిక్రయాలకు అనుమతులు ఇచ్చింది. దీంతో మార్కెట్లో చమురు లభ్యత పెరిగి ధర తగ్గుతోంది.అయినప్పటికీ సామాన్య వినియోగదారులకు వెంటనే ఊరట కలగకపోవచ్చని భావిస్తున్నారు. క్రూడాయిల్ ధరలు తగ్గినా దేశీయంగా చమురు సంస్థలు పెట్రోల్, డీజిల్ రేట్లను ఇప్పట్లో తగ్గించే అవకాశాలు ఉండవని నిపుణులు పేర్కొంటున్నారు.ఇటీవల యుద్ధం సమయంలో మే నెలలో దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధర లీటరుకు సగటున రూ. 7.50 వరకు పెరిగింది. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో లీటర్ పెట్రోల్ ధర రూ. 115.73 గా ఉండగా, డీజిల్ లీటరుకు రూ. 103.82 గా ఉంది. దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో హైదరాబాద్‌లోనే ఇంధన ధరలు అధికంగా ఉన్నాయి.

# పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా క్యూర్ పరిధిలో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇండ్లు

## జూన్ 28లోగా లొకేషన్ల ఖరారు
## జూలై మొదటి వారంలో బ్రోచర్ విడుదల
## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్: పేదల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆ కల నెరవేర్చే క్రమంలో వారి జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు అత్యంత సమీపంలోనే క్యూర్ పరిధిలో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార ఽ పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పేదల ఉపాధి, పిల్లల చదువు, కుటుంబ జీవన వ్యవస్థ దెబ్బతినకుండా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకొని వారు నివశిస్తున్న ప్రాంతాలలోనే వారికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి గారు స్పష్టం చేశారు.

గురువారం సచివాలయంలోని తన కార్యలయంలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఆర్‌డీఓ, తహసీల్దార్ కార్యాలయాల శాశ్వత భవనాల నిర్మాణం, భద్రాచలం దేవస్థానం అభివృద్ధి అంశాలపై అధికారులతో మంత్రి గారు సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ, ఈ ఏడాది క్యూర్ పరిధిలో లక్ష ఇండ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని, ప్రయోగాత్మకంగా తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 500 చొప్పున ఇళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు.

క్యూర్ పరిధిలోని 26 నియోజకవర్గాల్లో ఇప్పటికే దాదాపు 20 వరకు స్థలాలను గుర్తించామని, మిగిలిన ప్రాంతాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసి ఈ నెల 28వ తేదీ లోగా అన్ని లొకేషన్లను ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు.

అలాగే ప్రతి స్థలానికి సంబంధించిన ప్రణాళికలు, డిజైన్లు, నిర్మాణ నమూనాలను కూడా జూన్ 28లోగా సిద్ధం చేయాలని, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన విధివిధానాలు, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియ వివరాలతో కూడిన బ్రోచర్‌ను జూలై మొదటి వారంలో విడుదల చేస్తామని వెల్లడించారు. క్యూర్ పరిధిలో అత్యంత ముఖ్యమైన్ ప్రాంతాలల్లో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూముల్లో ఇండ్ల నిర్మాణాలను చేపడుతున్నామని ఈ స్థలాల్లో అన్ డివైడెడ్ షేర్ క్రింద మహిళలకు వాటా కల్పిస్తూ ఆ భాగాన్ని మహిళల రిజిస్ట్రేషన్ చేస్తామని మరోమారు స్పష్టం చేశారు.

రాష్టంలో హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఒకే మోడల్ లో ఆర్.డి.ఓ., తహశీల్దార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు. ఆయా జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకొని వీలైనంత త్వరితగతిన పనులు ప్రారంభించేలా ప్రణాళికలను సిద్దం చేసుకోవాలని ఆదేశించారు. అలాగే, ఆర్.డి.ఓ. తహశీల్దార్ కార్యాలయాల భవనాల మరమ్మతులకు సంబంధించి హౌసింగ్ ఏ.ఈ. లు భవనాలను విజిట్ చేసి ప్రతిపధనలు పంపించాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి, డి.ఎస్. లోకేశ్ కుమార్, హౌసింగ్ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 27న భద్రాచలం దేవస్థానం అభివృద్ధి పనులకు శ్రీకారం



హైదరాబాద్: తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, దక్షిణ అయోధ్యగా ఖ్యాతి గాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం అభివృద్ధి పనులకు ఈ నెల 27వ తేదీన శ్రీకారం చుదుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు.

గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, భద్రాచలం ఆలయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ, భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆగమశాస్త్ర నియమాలను కచ్చితంగా పాటిస్తూ ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలని స్పష్టం చేశారు.

భద్రాచలం ఆలయ వైభవం, ఆధ్యాత్మికతకు ఎటువంటి భంగం కలగకుండా, సంప్రదాయ శిల్పకళను ప్రతిబింబించేలా రాతి నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. రాబోయే రెండు వందల సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్ తరాలకు కూడా ఆదర్శంగా నిలిచే విధంగా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సంకల్పించారని ఈ మేరకు ఈ నెల 27వ తేదీన ఆలయ పునరుద్ధరణ పనులను అధికారికంగా ప్రారంభించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోనే పనులు పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. ఈ ఆలయ పునరుద్దరణ పనులకు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు 351 కోట్ల రూపాయలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. వచ్చే శ్రీరామ నవమి నాటికి నిర్దేశించిన పనులను యుద్ద ప్రాతిపదికన పూర్తి చేయడానికి ముందస్తుగానే పనుల విభజన చేసుకొని సమతరంగా అన్ని పనులు చేపట్టాలని సూచించారు.

# ఎస్ఐఆర్ పేరుతో ఓట్లు తొలగించే కుట్ర చేస్తున్నారు: భట్టి విక్రమార్క



హైదరాబాద్ తెలంగాణ ఎస్ఐఆర్ పేరుతో ఓట్లు తొలగించే కుట్ర చేస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. నియోజకవర్గంలోని ఓటర్ల లిస్ట్‌ను ఏఐకి ఇచ్చి విశ్లేషిస్తున్నారని, బీజేపీకి అనుకూలంగా లేని ఓట్లను తొలగిస్తారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఓటు హక్కు లేకపోతే పౌరసత్వం కూడా పోతుందన్నారు. అందుకే ఎస్ఐఆర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలని భట్టి విక్రమార్క సూచించారు. ఓటరు లిస్ట్‌లో ఓటు లేకపోతే 2025 నాటి మ్యాపింగ్ చూపించాలని కార్యకర్తలకు ఆయన తెలిపారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు 'ప్రజా ప్రభుత్వం' బంపర్ ఆఫర్



మొదటి పేజీ తరువాయి

ఈ అద్భుతమైన బీమా పథకం ద్వారా సాధారణ ప్రమాదాల్లో మరణిస్తే రూ. కోటి 25 లక్షలు, అదే విమాన ప్రమాదం జరిగితే రూ. 2 కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు బీమా పరిహారం అందుతుందని భట్టి విక్రమార్క వివరించారు.

18 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల ఉద్యోగులకు రూ. 10 లక్షల జీవిత బీమా రక్షణ ఉంటుందన్నారు. ప్రమాదవశాత్తూ శాశ్వత సంపూర్ణ వైకల్యం లేదా పాక్షిక వైకల్యం సంభవించినా ఈ పథకం ద్వారా ఉద్యోగులకు ఆర్థిక అండ లభిస్తుందన్నారు.

కేవలం రెగ్యులర్ ఉద్యోగులకే కాకుండా.. నెలనెలా ప్రభుత్వ రికార్డుల ద్వారా జీతం పొందే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, ఇతర తాత్కాలిక ఉద్యోగులందరికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు.

తమ కుటుంబంలో సంపాదించే వ్యక్తికి ఏదైనా ఆపద వస్తే ఆ కుటుంబం రాత్రికి రాత్రే రోడ్డున పడే పరిస్థితి ఉండకూడదు. ఉద్యోగులు కేవలం జీతగాళ్లు కాదు, వారి కుటుంబాలకు ఈ ప్రభుత్వం ఒక పెద్ద దిక్కుగా ఉంటుందని నమ్మకం కలిగించడమే మా లక్ష్యమని భట్టి విక్రమార్క చెప్పారు.

గత ప్రభుత్వ హయాంలో జీతాలు 15 లేదా 20వ తేదీ వరకు రాకపోవడం వల్ల ఉద్యోగులు పడిన ఇబ్బందులను భట్టి విక్రమార్క గుర్తుచేశారు. ప్రస్తుత కాలంలో ఇళ్లు, వాహనాలు, పిల్లల చదువుల కోసం ప్రతి ఒక్కరూ బ్యాంక్ ఇన్‌స్టాల్మెంట్స్ (ఈఎంఐలు) కడుతున్నారు. సకాలంలో జీతాలు రాకపోతే వారి అకౌంట్లు బ్యాడ్ అకౌంట్స్‌గా మారి సిబిల్ స్కోర్ దెబ్బతినేది. మా ప్రభుత్వం రాగానే ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉన్నప్పటికీ, సీఎం రేవంత్ రెడ్డి గారు 'ఉద్యోగుల హక్కులను కాపాడాలి' అని గట్టిగా నిర్ణయించుకుని, ఒకటో తేదీ నాడే జీతాలు ఇచ్చేలా కఠినమైన ప్రణాళికను అమలు చేశారని అన్నారు.

ఉద్యోగ సంఘాలు ఎప్పటి నుంచో కోరుతున్న హెల్త్ కార్డ్‌ల సమస్యకు ప్రజా ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిస్తోందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఒక ప్రత్యేక 'ట్రస్ట్' ద్వారా ఉద్యోగులందరికీ పూర్తి స్థాయిలో 'క్యాష్‌లెస్' (నగదు రహిత) వైద్య సేవలు అందించేలా క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని, దీనివల్ల ఆరోగ్య భద్రత మరింత మెరుగవుతుందని భరోసా ఇచ్చారు.

లబ్ధిదారులకు చేరవేసే వారధులు ఉద్యోగులే.. రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాల సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం పనిచేస్తోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ. 10 లక్షల ఉచిత వైద్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్, రేషన్ కార్డులపై సన్నబియ్యం, కళ్యాణలక్ష్మి/షాదీ ముబారక్ ద్వారా రూ. 1,11,116 ఆర్థిక సాయం వంటి ఎన్నో పథకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఈ సంక్షేమ ఫలాలను చిట్టచివరి లబ్ధిదారునికి చేర్చడంలో డెలివరీ మెకానిజంగా ఉద్యోగులే కీలక పాత్ర పోషిస్తున్నారని, అందుకే వారి కుటుంబ సంక్షేమాన్ని కూడా ప్రభుత్వం తన బాధ్యతగా తీసుకుందని కొనియాడారు.

ఈ బీమా పథకం నమోదుకు ముందుకు వచ్చిన బ్యాంకర్లకు భట్టి విక్రమార్క కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సుదూర విజన్‌కు అనుగుణంగా, 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ఉద్యోగులు, బ్యాంకర్లు, ప్రభుత్వం సమష్టిగా, చేయి చేయి కలిపి ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

# జనసేన కాపులు వర్సెస్ వైసీపీ కాపులు

కాకినాడ జూన్ 25 పిఠాపురం ఎమ్మెల్యే గారి తాలూకా అని 2024 ఎన్నికల ముందూ తరువాత ఏపీ అంతా ఊగేలా స్లోగన్స్ చేసింది జనసైన్యం. పిఠాపురం అలా ఏపీ అంతా హాట్ టాపిక్ తొలిసారి అయింది. ఆ క్రెడిట్ కచ్చితంగా పవన్ కళ్యాణ్ దే. ఎందుకంటే ఆయన వెండితెర మీద పవర్ స్టార్. ఆయన ఫాలోయింగ్ అన్నది ఊహాతీతం. ఆయన క్రేజ్ అన్నది అద్భుతం. అందుకే పిఠాపురం అన్న ఒక అసెంబ్లీ నియోజకవర్గం టాక్ ఆఫ్ ది స్టేట్ అయింది. అది పవన్ అక్కడ నుంచి పోటీ చేయాలని ఎంచుకుని నిలిచి గెలిచిన తరువాత జరిగిన డెవలప్మెంట్స్ గానే వీటిని చూడాల్సి ఉంది.పిఠాపురం నుంచి పవన్ పోటీ చేసి గెలిచారు. ఆయన ఆ తరువాత ఉప ముఖ్యమంత్రి అయ్యారు. ఇక రెండేళ్ళ కూటమి పాలనలో కాపులకు న్యాయం జరగడం లేదని వైసీపీ కాపులంతా ఒక చోట చేరి మీటింగ్ పెట్టారు. అది కోనసీమ జిల్లా వేదికగా జరిగింది. ఈ మీటింగ్ తరువాత రాజకీయ ప్రకంపనలు ఒక రేంజిలో సాగుతున్నాయి.

## నషా ముక్త్ భారత్ అభియాన్ ద్వారా మాదకద్రవ్యాల నిర్మూలనకు సమిష్టి కృషి అవసరం -- అదనపు జిల్లా కలెక్టర్ డా. కిరణ్మయి




**రంగారెడ్డి జిల్లా ప్రజాబలం ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన "నషా ముక్త్ భారత్ అభియాన్" (NMBA) కార్యక్రమంలో అదనపు జిల్లా కలెక్టర్ డా. కిరణ్మయి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తిగత జీవితాన్నే కాకుండా కుటుంబాలు, సమాజం మరియు దేశ భవిష్యత్తుపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు.

ప్రభుత్వం చేపడుతున్న "నషా ముక్త్ భారత్ అభియాన్" ద్వారా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. యువత తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరుచుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.

వ్యసన రహిత సమాజ నిర్మాణంలో ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు మరియు ప్రజలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. "వికసిత్ భారత్‌కు నషా ముక్త్ భారత్ పునాది" అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటమే కాకుండా ఇతరులను కూడా చైతన్యపరిచి ఆరోగ్యవంతమైన, సురక్షితమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు.

సమాజంలో జరుగుతున్న నేరాలు, ముఖ్యంగా పిల్లలపై జరిగే అఘాయిత్యాలను అత్యంత తీవ్రంగా పరిగణించాలని ఆమె అన్నారు. ఎక్కడైనా అనుమానాస్పద సంఘటనలు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. మాదకద్రవ్యాలు (డ్రగ్స్) మరియు మద్యం (ఆల్కహాల్) అనేక నేరాలు, రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

పిల్లలను డ్రగ్స్ మరియు ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, "నాకెందుకులే" అనే నిర్లక్ష్య భావనకు బదులుగా సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. సమాజం సురక్షితంగా, ఆరోగ్యకరంగా ఉంటేనే వ్యక్తులు, కుటుంబాలు కూడా సంతోషంగా ఉంటాయని తెలిపారు. అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ సహకరిస్తారని, అందరూ కలిసి పనిచేస్తేనే నేరాలు మరియు సామాజిక సమస్యలను సమర్థవంతంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు.

అనంతరం అదనపు కలెక్టర్ అందరి చేత "నేను మాదక ద్రవ్యాల పై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని నేను డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ నాతోపాటు ఏ ఒక్కరు డ్రగ్స్ బారిన పడకుండా ఉండటానికి కృషి చేస్తానని డ్రగ్స్ అమ్మకం కొనుగోలు మరియు అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తానని నేను డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని ప్రతిజ్ఞ చేయించారు."

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి అనంత్ రెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ మరియు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, కలెక్టరేట్ ఎఓ సునీల్, సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## 27న శ్రీమానస ఆర్ట్ థియేటర్స్ 45వ వార్షికోత్సవం!




హైద్రాబాద్ జూన్ 25 ;శ్రీమానస ఆర్ట్ థియేటర్స్ 45వ వార్షికోత్సవం వేడుకలు రవీంద్రభారతిలో ఈనెల 27న శనివారం ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 1గం. వరకు నిర్వహిస్తున్నట్లు శ్రీమానస ఆర్ట్ థియేటర్స్ సస్థ అధ్యక్షులు బి.రామచంద్ర రావు తె లిపారు.అష్టోత్తర శత వైణిక నాద యజ్ఞం-నిర్వహించనున్నారు. ముఖ్యఅతిథిగా డా.కేవీ రమణాచారి రిటైర్డ్ ఐఏఎస్ హాజరవుతున్నారు. ప్రముఖ సాహితీవేత్త డా.పి. లలిత వాణి సభాధ్యక్షత వహిస్తారు. లహరిశ్రీ నృత్యనికేతన్ వ్యవస్థాపకురాలు డా. ఝాన్సీరామ్, వండర్ బుక్ ఆఫ్ రికార్డు అధినేత బింగి నరేందర్ గౌడ్, ఆధ్యాత్మికవేత్త మీనాక్షి శ్రీనివాస్-అతిథులుగా హాజరవుతున్నారు. బి.రామచంద్రరావు(అధ్యక్షులు), రఘుశ్రీ(ఉమ్మడిసింగు రాఘవరావు, కార్యదర్శి), దివ్యసాయి వీణా అకాడమీ -పి.వరప్రసాద్ అధ్యక్షులు, డా. కళ్యాణి హేమలత వ్యవస్థాపకులు ఈ వేడుకల వివరాలను ఓ పత్రికాప్రకటనలో తెలిపారు. శ్రీమానస ఆర్ట్ థియేటర్స్, దివ్యసాయి వీణా అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు

## ఈనెల 28న నల్లగొండకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### 13వేల కోట్ల వ్యయంతో నిర్మించే R&B హ్యామ్ రోడ్ల పనులకు శంకుస్థాపన చేయనున్న సీఎం

### సిఎం పర్యటన సందర్భంగా ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పర్యవేక్షించిన మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి



నల్లగొండ జూన్ 25 ; ఈనెల 28న నల్లగొండకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్నారు. హైదరాబాద్ నుండి హెలికాప్టర్ లో బయలుదేరి నల్లగొండ జిల్లా కనగల్ మండలం చేరుకొని...మొదటగా...
మధ్యాహ్నం 3:30 గంటల ప్రాంతంలో...కనగల్ మండలం ~వీజ మార్కెట్ యార్డు వద్ద నిర్మించిన "హ్యామ్" రోడ్ల పైలాన్ ను ఆవిష్కరించనున్నారు
అనంతరం...నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లో మొదటి ఫేజ్ డ్రింకింగ్ వాటర్ అందించే పనులకు శంకుస్థాపన చేయనున్న సిఎం
ఎన్జీ కాలేజి గ్రౌండ్స్ లో జరిగే భారీ బహిరంగ సభకు హాజరుకానున్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగం...అనంతరం SHG మహిళా సంఘాలకు చెక్కులు అందజేయనున్న న్నారు

## చలో వికారాబాద్ ,సమావేశంలో పాల్గొంటున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీతారకరామారావు

### సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జెడ్పిటిసి మధుకర్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 25(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** చలో వికారాబాద్ ఓటు సవరణ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొంటున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ తారక రామారావు28/06/2026 రోజు ఉదయం 9 గంటలకు సాకేత్ నగర్ గౌలికర్ ఫంక్షన్ హాల్లో ా × = ఓటర్ సవరణకార్యక్రమం మరియు పార్టీ సభ్యత్వం కొరకు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయుటకు బూత్ స్థాయిమరియు ముఖ్య కార్యకర్తల సమావేశం నకు
ముఖ్య అతిథిగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు వస్తున్నారు
కాబట్టి మర్పల్లి మండల దీ=ా ముఖ్య కార్యకర్తలు మరియు బూతు కమిటీ కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయగలరని మాజీ జెడ్పిటిసి మధుకర్, సీనియర్ నాయకులు మాజీ ఎంపిటిసిలు, మాజీ సర్పంచులు నూతన సర్పంచులు, పెద్దలు కార్యకర్తలు పెద్ద ఎత్తున సమావేశానికి హాజరుకావాలని ముఖ్య నాయకులు సమావేశమై పలు అంశాల గురించి చర్చించడం జరిగిందని తెలిపారు

## రామగుండం అభివృద్ధి పనుల్లో జాప్యాన్ని సహించేది లేదు : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

### రామగుండం అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి, జూన్-25, ప్రజాబలం ప్రతినిధి:**రామగుండం ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యాన్ని సహించబోమని, మంజూరైన ప్రతి పనిని వేగంగా క్షేత్రస్థాయిలో ప్రారంభించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ తో కలిసి రామగుండం అభివృద్ధి పనులపై నిర్వహించిన సమీక్ష



సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ డీఎంఎఫ్‌టీలో నిధులు సిద్ధంగా ఉన్నప్పటికీ స్మశానవాటికలు, మహిళా శక్తి భవనాలు, విద్యాసంస్థల అభివృద్ధి పనులు, తాగునీటి పనులు, ఇతర మౌలిక వసతుల పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఇంజినీరింగ్ అధికారి రోజు వారీగా పనులను పర్యవేక్షిస్తూ వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల స్థాయిలో నిర్మిస్తున్న మహిళా సంఘ భవనాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, టెండర్ ప్రక్రియల్లో జాప్యం లేకుండా వెంటనే పూర్తి చేసి క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించాలని సూచించారు. రూ.5 లక్షల విలువైన చిన్న పనులు కూడా ఏడాది గడిచినా పూర్తికాకపోవడం అధికారుల పనితీరును ప్రతిబింబిస్తోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. జూలై రెండో వారానికల్లా మంజూరైన మెజారిటీ అభివృద్ధి పనులకు గ్రౌండింగ్ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కోర్టు భవనం నిర్మాణానికి సంబంధించిన సవరించిన అంచనాలకు ప్రభుత్వం నుంచి త్వరగా ఆమోదం వచ్చేలా నిరంతరం ఫాలోఅప్ చేయాలని, మెడికల్ కళాశాల హాస్టల్ నిర్మాణ అంచనాలను తక్షణమే ఖరారు చేయాలని ఆదేశించారు. 2 బీహెచ్‌కే గృహాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న విద్యుత్, సెప్టిక్ ట్యాంకులు, తాగునీటి వంటి మౌలిక వసతుల పనులను వారంలోగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే పట్టాలు పంపిణీ చేసిన లబ్ధిదారులకు ఇంటి తాళాలు కూడా అందజేసి వెంటనే గృహ ప్రవేశం చేసేలా చర్యలు తీసుకోవాలని, మున్సిపాలిటీ ద్వారా ఇంటి నంబర్లు జారీ చేయాలని ఆదేశించారు. రామగుండంలోని విద్యాసంస్థల్లో మంజూరైన అన్ని అభివృద్ధి పనులను అత్యంత వేగంగా పూర్తి చేయాలని, నరేగా ద్వారా చేపడుతున్న అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను జూన్ 30లోపు పూర్తి చేసి బిల్లులు క్లెయిమ్ చేయాలని సూచించారు. నరేగా నిధుల్లో ఒక్క రూపాయి కూడా వృథా కాకుండా పూర్తిస్థాయిలో వినియోగించాలని, నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందిరమ్మ గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలని, అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పలుమార్లు సూచించినా నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులతో మాట్లాడి అవసరమైతే మంజూరు రద్దుకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. మొదటి విడతలో మిగిలిన గృహాల మంజూరుకు అవసరమైన సర్వే పూర్తి చేసి ఒకే రోజు పెద్ద ఎత్తున మంజూరు ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రామగుండం నగరంలో గృహ నిర్మాణాలు, తాగునీటి పనులు, మహిళా శక్తి భవనాల నిర్మాణాలను ప్రాధాన్యత క్రమంలో వేగవంతం చేయాలని, పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. రామగుండంలో సుమారు రూ.50 కోట్ల విలువైన అభివృద్ధి పనులు ఇంకా కాగితాలకే పరిమితమై ఉన్నాయని, వాటిని అత్యవసరంగా గ్రౌండ్ చేసి అమలు దశకు తీసుకురావాలని సూచించారు. నిధులు సిద్ధంగా ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో పనులు జరగకపోవడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. రామగుండం నగరంలో పారిశుద్ధ్య పరిస్థితిని పూర్తిగా మెరుగుపర్చాలని, ప్రతి నెల రూ.2 కోట్ల వరకు పారిశుద్ధ్య సిబ్బంది వేతనాలకు ఖర్చు చేస్తున్నప్పటికీ రహదారులపై చెత్త కనిపించడం అంగీకారయోగ్యం కాదన్నారు. నగరంలో ఒక్క బ్లాక్ స్పాట్ కూడా లేకుండా వీధి దీపాల ఏర్పాటు, ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి కనెక్షన్ అందించడం ప్రాధాన్యతగా తీసుకుని పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీర్లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భారీ మేజారిటీతో గెలవకుంటే రాజకీయలకు రాజీనామా

రంగారెడ్డి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మాల్ రెడ్డి హాట్ కామెంట్స్ చేసారు. 40,000 ఓట్ల మెజారిటీతో నియోజకవర్గ ప్రజలు తనను గెలిపించారని వచ్చే ఎన్నికల్లో 80000 వేల ఓట్ల మెజార్టీతో గెలవకుంటే రాజకీయల నుండి తప్పుకుంటానని సంచలన వ్యాఖ్యలు చేసారు. కేవలం నియోజకవర్గంలో రోడ్ల కోసమే 700 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టమన్నారు. నేను కబ్జా పెట్టిన అని తెలిస్తే దేనికైనా సిద్ధమని సవాల్ విసిరారు. మీరు చేసిన కబ్జాలన్నీ బయటపెట్టినందుకే తనపై తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారంటూ మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచి రెడ్డి కిషన్ రెడ్డి పై తీవ్ర విమర్శలు చేశారు. వచ్చే పది సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. అబ్దుల్లాపూర్ మెట్ రైతు సేవ సహకార సంఘం ఏర్పాటు చేసిన గోదాం శంకుస్థాపన కార్యక్రమంలో ఈ వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోవడమే తన లక్ష్యమని దాన్ని కొరకే నిత్యం కృషి చేస్తానని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ చేసిన అవినీతిని బయట పెట్టడం జరుగుతుందన్నారు. తను ఇంచ్ కబ్జా పెట్టిన దేనికైనా సిద్ధమని సవాల్ విసిరారు. తన నమ్ముకున్న తన కోసం పనిచేసే ప్రాణమిచ్చే కార్యకర్తల కోసం పనిచేయడమే తన తపన అని మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు.

## " గాయత్రీ మంత్రాన్ని ఉపాసిస్తే సృష్టికి ప్రతి సృష్ఠిచేసే శక్తి వస్తుంది

## - శ్రీశ్రీశ్రీ త్రిదండి అహోబీల రామానుజ జియార్ స్వామి.



హైద్రాబాద్ (ఎల్ బి నగర్ )జూన్ 25; ఎస్ వి ఎస్ ట్రస్ట్ మరియు శ్రీ వైష్ణవ సేవా రాష్ట్ర సంఘం- తెలంగాణ సంయుక్త అధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తి అన్ని జిల్లాలకు 8చెందిన శ్రీ వైష్ణవ వటువులు 50 మందికి " సామూహిక ఉచిత ఉపనయన సంస్కారం" కార్యక్రమం, ఎల్ బి నగర్ లోని ట్రస్ట్ భవనంలో నిర్వహింపబడింది.

ఈ కార్యక్రమంలో ముఖ్య - అతిథిగా విచ్చేసిన శ్రీ శ్రీ శ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామివారు వటు వులందరికి " బ్రహ్మోప దేశాన్ని" చేశారు. ఈ సందర్భంగా వారు అనుగ్రహ భాషణం చేస్తూ గాయత్రీ మంత్ర) వైశిష్ట్యాన్ని వివరించారు. విశ్వామిత్ర మహర్షి 'గాయత్రీ మంత్రాన్ని ఉపాసించి సృష్టికి ప్రతిపృష్టి చేశారని ,అంతటి శక్తిని పొందారని తెల్పారు - వటువులు నిత్యం గాయత్రిని ఉపాసిస్తే అమితమైన శక్తిని పొందుతారన్నారు .



ఈ కార్యక్రమంలో మరో ముఖ్య అతిథిగా పాల్లన్న శ్రీ శ్రీ శ్రీ (త్రి)దండి దేవనాధ జీయర్ స్వామి వారు వటువుల నుద్దేశించి అనుగ్రహ భాషణం చేస్తూ, ఉత్తమో త్తమజన్మా మానవ జన్మా అని మానవజన్మ పొందిన జీవునికి జరిపే సంస్కారాలలో భాగంగా "ఉపనయన సంస్కారం" ఉత్కృష్టమైనది అని తెలిపారు. ఈ ఉపనయన సంస్కారం ద్వారా వేదాద్యాయనం ప్రారంభము అతుందన్నారు. ఉపసయన సంస్కారం పొందనివాడు భ్రష్టు డౌతారని జన్మ వ్యర్థ మౌతుందన్నారు. గాయత్రి) ఉపాసన ద్వారా లౌకిక విధ్యలలో ఏకాగ్రత, చైతన్యత కల్గుతుందని తద్వారా ఉత్తమ సంస్కారం కలిగినవారుగా సమాజంలో చక్కని జీవితాన్ని గడువుతారని తెలిపారు.అనంతరం సంధ్యా వందనం పుస్తకాన్ని శ్రీ దేవనాథ్ జియార్ స్వామి ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో గాజూట్రస్ట్ ఛైర్మన్ కే. యాదగిరాచార్యులు జనరల్ సెక్రెటరీ లక్ష్మీనాధా చార్యాలు శ్రీ వైష్ణవ సేవా రాష్ట్ర సశీఘశీ తెలంగాణ, రాష్ట్ర అధ్యక్షులు తిరువరంగం ప్రభాకర్ ప్రధాన కార్యదర్శి పిచర కృష్ణ , పొడిచేటి రామకృష్ణ - ట్రక్ట్ సభ్యులు" శటగోపాచార్య-మాధవాచార్య - వరదా చార్యులు ,నరేంద్రా చార్యులు సంఘ నాయకులు, యాదగిరిచార్య - శశికిరన్ యాజ్ఞాకులు జగన్నాధాచార్య, దరిపిల్ల లక్ష్మ నాచార్యులు, మరియు మహిళా విభాగాం అధ్యక్షురాలు ప్యారకీ అరుణ- గీత ,హైదరాబాద్ మహానగర కార్యవర్గసభ్యులు, శ్రీనివాసారి. జనార్ధనా చార్య తదితరులు నిర్వహించడంలో పాల్గొన్నారు.

వటువులకు సంబందించి బందువులు మిత్రులు 500 పైగా పాల్గొని దిగ్వజమం చేసినారు.

వటువులకు దీక్షా వస్త్రాలు ఇతర సంబంధిత సామగ్రిని ఉచితంగా పంపినీ చేయడం పట్ల అందరు అభినందనలు వ్యక్తం చేసారు.

## షేర్‌గూడలో ఉచిత మెడికల్ క్యాంప్ --

## ప్రజలకు వైద్య సేవలు, ఉచిత మందుల పంపిణీ




రంగారెడ్డి జిల్లా జూన్ 25;డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా షేర్‌గూడ గ్రామంలో ఉచిత మెడికల్ క్యాంప్ ఘనంగానిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను పొందారు.

ఈ శిబిరంలో సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు కంటి పరీక్షలు, దంత పరీక్షలు, రక్తపోటు, షుగర్ పరీక్షలు నిర్వహించారు. వైద్యుల సలహా మేరకు అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స పొందేలా ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో వైద్యులు, ఫార్మసీ విద్యార్థులు మరియు వాలంటీర్లు సేవలందించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను వివిధ ప్రాంతాల్లో నిరంతరం నిర్వహిస్తోందని సొసైటీ ఎక్స్ గ్యుటీ మెంబర్ జి.మాధవి తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైద్య బృందం, వాలంటీర్లు మరియు గ్రామ ప్రజలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## వెంకట్ రెడ్డి నగర్ డివిజన్లో ప్రారంభమైన ఎస్ఐఆర్ ప్రక్రియ



వెంకట్ రెడ్డి నగర్ డివిజన్లో ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభమైంది. తొలిరోజు పలు బూత్ లలో బీఎల్వో ఆఫీసర్లు ఇంటింటికీ తిరిగి ఎస్ఐఆర్ ఫారాలను అందజేశారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఉప్పల్ నియోజకవర్గం సీనియర్ నాయకుడు వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ కరిపే శంకర్ వంజరి ఆదేశాల మేరకు వెంకట్ రెడ్డి నగర్ లో పవన్ కుమార్, సంతోష్ సాయి, బూత్ నెంబర్ 314 కామాక్షి పురం కమిటీ హాల్ పాల్గొనడం జరిగింది

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను

## క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జూన్ 25:**ఓటర్ల జాబిత ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా గురువారం ప్రారంభించిన బిఎల్ఓ లు ఇంటింటికి అందిస్తున్న ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని తిమ్మాపూర్, ఎదులాబాదులలో జిల్లా కలెక్టర్ మను చౌదరి ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మీకు ఎన్ని ఎన్రోల్ మెంట్ పత్రాలు ఇచ్చారని, ఒక్కొక్కరికి ఎన్ని ఎన్రోల్ మెంట్ పత్రాలు ఇస్తున్నారని, ఎన్రోల్ మెంట్ యాప్ ద్వారా అప్ లోడ్ చేసే ప్రక్రియను బిఎల్ ఓ ను అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్కరికి రెండు పత్రాలు అందజేస్తున్నామని, సెల్ ఫోన్ లో క్యూఆర్ కోడ్ ద్వారా అప్ లోడ్ చేస్తున్నామని బిఎల్ ఓలు వివరించారు.ఈ పర్యటనలో కీసర ఆర్డిఓ వెంకట్ రెడ్డి, శామీర్ పేట్ తహాసీల్దారు యాదగిరి రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర అభివృద్ధికే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక

## అర్హులందరికీ సంక్షేమ పథకాల అమలు: వికాస్ రాజ్




**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జూన్ 25**:ప్రజల సమస్యలను గుర్తించి అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ప్రధాన లక్ష్యమని జిల్లా ప్రత్యేక అధికారి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ అన్నారు. గురువారం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలుపై నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వికాస్ రాజ్ మాట్లాడుతూ వార్డు సభలు, జిల్లా సభల ద్వారా ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. వివిధ శాఖలు గుర్తించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో నీరు నిలిచే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ జిల్లాలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను విజయవంతంగా అమలు చేశామన్నారు. బాల్యవివాహాల నిర్మూలన, పోక్సో కేసుల నియంత్రణ, రహదారి భద్రత, ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలతో పాటు వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు.

అనంతరం జిల్లా ప్రత్యేక అధికారి అన్ని శాఖల అధికారులు 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలుపై సమగ్ర నివేదికలు, విజయగాథలు, ఉత్తమ పద్ధతులు, ఛాయాచిత్రాలతో కూడిన డాక్యుమెంటేషన్‌ను సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కోటిరెడ్డి, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి, మునిసిపల్ కమిషనర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఏం సాధించావని సువర్ణ అధ్యాయం రేవంత్ రెడ్డి?

## రేవంత్ వ్యాఖ్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ధ్వజం

కర్ణాటకలోని తుంగభద్ర డ్యామ్ గేట్లు మార్చినందుకు సంబురాలు చేసుకోవడం పక్కనపెట్టి.. కృష్ణా జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటా గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి..

ఆర్డీఎస్ నీటి వాటా విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై రేవంత్ రెడ్డి ఏదైనా స్పష్టమైన హామీ సాధించారా?

ఆంధ్రా వైపు ఉన్న ఆర్డీఎస్ తూములను శాశ్వతంగా మూసివేసేలా, ఆర్డీఎస్ ఆనకట్టకు మరమ్మతులు చేసేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఒప్పించారా?

కర్ణాటక పరిధిలో ఉన్న ఆర్డీఎస్ కాలువకు తక్షణమే మరమ్మతులు చేసి, క్రమం తప్పకుండా నిర్వహించేలా ఆ రాష్ట్రం నుంచి హామీ తీసుకున్నారా?

ఈ పనులు జరగకపోవడం వల్లే ఆర్డీఎస్ కింద తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటా ప్రతిసారీ కోల్పోవాల్సి వస్తోంది.

కేవలం తుంగభద్ర డ్యామ్ గేట్లు మార్చినంత మాత్రాన తెలంగాణకు రావాల్సిన 15.90 టీఎంసీల నీరు ఎలా వస్తుందో రేవంత్ రెడ్డి చెప్పాలి. గత 75 ఏళ్లుగా పాత గేట్లు పనిచేస్తూనే ఉన్నాయి.

అయినా కూడా ఆర్డీఎస్ ద్వారా తెలంగాణకు ఏనాడూ 5 టీఎంసీలకు మించి నీళ్లు రాలేదు.

తుంగభద్ర డ్యామ్ గేట్లు మార్చడానికీ, తెలంగాణకు దక్కాల్సిన 15.90 టీఎంసీల నీటి వాటాకు ఎలాంటి సంబంధం లేదు. మరి ఈ కీలకమైన విషయంపై రేవంత్ రెడ్డి సాధించిన హామీ ఏమిటి?

"సిస్టమ్ లాసెస్" అనే వాదనను రేవంత్ రెడ్డి ఎందుకు అంగీకరించారు? కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్ (ఖఔఱు-×) అవార్డులో ఈ "సిస్టమ్ లాసెస్" అనే విధానానికి అసలు గుర్తింపే లేదు.

ట్రైబ్యునల్ అవార్డు పరిధిలో లేని ఈ వాదనను అడ్డుపెట్టుకుని, తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటాను తగ్గించడానికి వీల్లేదు.

కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ పరిమితికి మించి వాడుకుంటున్న తీరును రేవంత్ రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదు?

కేసీ కెనాల్ కోసం సుంకేసుల వద్ద ఆంధ్రా ప్రభుత్వం ఏకంగా 39 టీఎంసీల నీటిని వాడుకుంటోంది. దీనికి తోడు, కర్ణాటకతో కుమ్మక్కై కేసీ కెనాల్‌కు వెళ్లాల్సిన దాదాపు 10 టీఎంసీల నదీ జలాలను =దీనూజ,=దీూజ లకు మళ్లిస్తోంది.

దీనివల్ల తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతున్నా రేవంత్ రెడ్డి ఎందుకు నిలదీయలేదు?

తెలంగాణ నీటి హక్కులకు ముప్పుగా మారే కొత్త ప్రాజెక్టులను ముఖ్యమంత్రి ఎందుకు వ్యతిరేకించలేదు?

తుంగభద్ర డ్యామ్, ఆర్డీఎస్ మధ్యలో దాదాపు 35 టీఎంసీలు వాడుకునేలా కర్ణాటక ప్రభుత్వం 'నవలి రిజర్వాయర్' నిర్మించాలని చూస్తోంది. అలాగే, ఆర్డీఎస్, సుంకేసుల మధ్య 20 టీఎంసీలు వాడుకునేలా



'గుండ్రేవుల ప్రాజెక్టు' కట్టాలని ఆంధ్రా ప్రదేశ్ సర్కార్ ప్లాన్ చేస్తోంది.

ఈ రెండు ప్రాజెక్టుల వల్ల కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాకు తీవ్ర గండిపడుతుంది.

ఈ ప్రాజెక్టుల విషయంలో తెలంగాణకు న్యాయం జరగకుండా రేవంత్ రెడ్డి ఎందుకు అభ్యంతరాలు తెలుపలేదు?

ఇన్ని సమస్యలు పెట్టుకుని రేవంత్ రెడ్డి దేనికోసం సంబురాలు చేసుకుంటున్నారు?


తెలంగాణకు దక్కాల్సిన 15.90 టీఎంసీల వాటాను సాధించారా?

ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఆర్డీఎస్ సమస్యలను పరిష్కరించారా?

తెలంగాణకు మేలు చేసే ఈ కీలక అంశాలపై ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి కచ్చితమైన హామీలు ఏమైనా తీసుకున్నారా?

ఈ ప్రధాన సమస్యల్లో ఏ ఒక్కటీ పరిష్కారం కాకుండా జరిగిన సమావేశం సువర్ణ అధ్యాయం ఎలా అవుతుంది? తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణను గాలికి వదిలేసి ప్రచారం పేరిట మీరు చేసిన డ్రామా తెలంగాణకు నిష్ప్రయోజనం.

# జాయకా ఫుడ్ కోర్టు సీజ్



హైదరాబాద్ సైబరాబాద్ పరిధిలోని కొండాపూర్ ఏఎంబీ మాల్ సమీపంలో జాయకా ఫుడ్ కోర్ట్ లైసెన్స్ రద్దు అయింది. ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో నమ్మలేని నిజాలు వెలుగు చూసాయి. ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఈటూాంఎ) లైసెన్స్ తక్షణమే సస్పెండ్ చేసారు. స్టోరేజ్ రూమ్లలో ఎలుకలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ఆహార ప్యాకెట్లను కొరికేసాయి. ప్యాకేజింగ్ నిల్వ ఉంచే ప్రాంతాల్లో భారీగా ఎలుకల రెట్టలు లభ్యమయ్యాయి. ఫ్రీజర్ పనిచేయకపోయినా అందులోనే నిల్వ ఉంచిన చికెన్ బిర్యానీ, కూరగాయలు కుళ్లిపోయాయి. ఎగ్ మయోనైస్ నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచారు. హోటల్ నిర్వాహకుల వద్ద మెడికల్ ఫిట్నెస్ సర్టిఫికెట్లు కానీ, పెస్ట్ కంట్రోల్ రికార్డులు కానీ లేవు. తనిఖీ చేసి అనుమతించే వరకు సదరు ఫుడ్ కోర్టు నడపకూడదని అధికారులు నోటీస్ జారీ చేశారు..

# విద్యుత్ అధికారులు నిర్లక్ష్యానికి కార్మికుడు



మేడ్చల్: బలికండ్లకోయలో విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సమయంలో సరఫరా నిలిపివేయకుండా పనులు చేయించడం వల్ల కార్మికుడు విద్యుత్ షాక్ కు గురయ్యాడు.ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు.ఈ ప్రమాదానికి కారణమైన ఏఈ, లైన్ మెన్ ని సస్పెండ్ చేసి తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.దీంతో పోలీసులకు,బాధిత కుటుంబ సభ్యులకు వాగ్వదం జరిగింది.మృత దేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

## ఐదో అంతస్తు నుంచి కిందపడి యువతి మృతి

హైదరాబాద్ మియాపూర్లో జరిగిన ఓ ఘటన తీవ్ర కలకలం రేపింది. మయూరి నగర్లోని ఓ అపార్ట్మెంట్లో 20 ఏళ్ల యువతి ప్రణవి ఐదో అంతస్తు నుంచి కిందపడి చనిపోయింది. క్షణాల్లో జరిగిన ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, స్థానికులు షాక్కు గురయ్యారు. సాధారణంగా ప్రశాంతంగా కనిపించే ఈ ప్రాంతంలో ఒక్కసారిగా జరిగిన ఈ ఘటనతో అపార్ట్మెంట్ పరిసరాల్లో ఆందోళన వాతావరణం ఏర్పడింది. పోలీసుల ప్రాథమిక వివరాల ప్రకారం.. ప్రణవి అపార్ట్మెంట్ ఐదో అంతస్తులోని పిట్టగోడపై కూర్చుని ఫోన్లో మాట్లాడుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఫోన్ కాల్లో ఉండగా ఆమె బ్యాలెన్స్ కోల్పోయి ఒక్కసారిగా జారి కిందపడినట్లు పేర్కొంటున్నారు.. అయితే ఇది పూర్తిగా ప్రమాదవశాత్తు జరిగిన ఘటననా లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో కూడా పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. ఘటన జరిగిన వెంటనే భారీ శబ్దం వినిపించడంతో అపార్ట్మెంట్ వాసులు బయటకు వచ్చి చూడగా యువతి తీవ్ర గాయాలతో నేలపై పడిఉన్నట్లు గుర్తించారు. తీవ్ర గాయాలతో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ప్రణవిని రక్షించేందుకు ప్రయత్నించారు.. హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. స్థానిక పోలీసు బృందం ఘటన స్థలాన్ని పరిశీలించి ఆధారాలను సేకరించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని తీవ్ర విషాదంలో మునిగిపోయారు. యువతి ఆకస్మిక మరణంతో కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ప్రణవి ఫోన్ కాల్ డేటా, ఆమె చివరి క్షణాల్లో ఎవరితో మాట్లాడిందనే వివరాలను సేకరిస్తున్నారు. అలాగే అపార్ట్మెంట్లోని సీసీటీవీ ఫుటేజ్ను కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఆమె పడిపోయిన సమయంలో అక్కడ ఎవరు ఉన్నారు..ని ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు ఉన్నాయా అనే అంశాలపై కూడా విచారణ కొనసాగుతోంది.

# వేడెక్కిన నార్త్ పాలిటిక్స్

లక్నో జూన్ 25 త్వరలో కేంద్ర మంత్రివర్గంతో పాటు బీజేపీ సంస్థాగత నిర్మాణంలో పెద్ద ఎత్తున మార్పులకు అవకాశాలు కనిపిస్తున్నాయి. దాంతో ఉత్తరాదిన పాలిటిక్స్ హీటెక్కాయి. ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అయ్యారు. 2027 ప్రారంభంలో ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, మణిపూర్, గోవా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఆయా రాష్ట్రాల్లో తమ పట్టును బలోపేతం చేసుకునే వ్యూహంలో భాగంగానే బీజేపీ కేంద్ర మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణపై కసరత్తు చేస్తోందని తెలుస్తోంది.కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ రాజ్యసభ పదవీ కాలం ముగియడం, ఆయనను మళ్లీ ఎగువ సభకు పంపకూడదని నిర్ణయించడంతో కేంద్ర కేబినెట్లో కేరళ ప్రాతినిధ్యంపై కొత్త చర్చ మొదలైంది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని మంత్రివర్గంలో కేరళకు మరో అవకాశం ఉంటుందా లేదా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం కేరళ నుంచి ఉన్న ఏకైక బీజేపీ మంత్రి, నటుడు సురేష్ గోపి మాత్రమే. ఆయన త్రిసూర్ లోక్సభ స్థానం నుంచి విజయం సాధించి మోదీ కేబినెట్లో చోటు దక్కించుకున్నారు. కేంద్ర కేబినెట్ భేటీ కానుందని, ఆ తర్వాత మంత్రుల శాఖల మార్పు లేదా కొత్త వారికి కేబినెట్ లోకి తీసుకోవడంపై ప్రకటన రావచ్చని తెలుస్తోంది. ఇద్దరు కేంద్ర మంత్రులు జార్జ్ కురియన్, రవ్నీత్ సింగ్ బిట్టూలను బీజేపీ మళ్లీ రాజ్యసభకు పంపలేదు. మరోవైపు బిట్టూ ఇంకా రాజీనామా చేయలేదు. అయితే, తాను పంజాబ్ రాజకీయాల్లోకి తిరిగి వస్తున్నానని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానని స్పష్టం చేశారు.'ఒక వ్యక్తి, ఒకే పదవి' బీజేపీ రూల్ పాటించడం ద్వారా మరో ఇద్దరు మంత్రులకు పదవీగండం ఉంది. ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన హర్ష్ మల్హోత్రా, ఉత్తరప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు పంకజ్ చౌదరి ఈ జాబితాలో ఉన్నారు. వచ్చే ఏడాది ప్రారంభంలో యూపీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న క్రమంలో బీజేపీ నిబంధనల ప్రకారం పంకజ్ చౌదరి కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయనున్నారు. 80 లోక్సభ స్థానాలు ఉన్న యూపీలో, గత అసెంబ్లీ ఎన్నికల్లో అఖిలేష్ యాదవ్ బీజేపీకి గట్టి షాక్ ఇచ్చారు.దీంతో కేంద్ర ప్రభుత్వం పంకజ్ చౌదరి స్థానంలో మరో ఓబీసీ లేదా దళిత నేతకు.. ముఖ్యంగా పూర్వాంచల్ ప్రాంతానికి చెందిన వారికి మోదీ కేబినెట్లో చోటు కల్పించవచ్చు. సమాజ్వాదీ పార్టీ, కాంగ్రెస్ల (వెనుకబడిన, దళిత, మైనారిటీ) ఫార్ములాను తిప్పికొట్టేందుకు బీజేపీ ఈ మార్పుల ద్వారా కొత్త వారికి ఛాన్స్ ఇచ్చి యూపీలో సోషల్ బ్యాలెన్స్ సాధించాలని చూస్తోంది.వచ్చే ఏడాది పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. రవ్నీత్ బిట్టూ రాజ్యసభ పదవీ కాలం ముగియడంతో పంజాబ్ నుంచి ఒక మంత్రి పదవి ఖాళీ అవుతుంది. బీజేపీ ఇక్కడ కేవల్ సింగ్ ఢిల్లాన్ను పంజాబ్ అధ్యక్షుడిగా నియమించింది. ఒక హిందువుకు కేబినెట్లో అవకాశం ఇస్తుందని సమాచారం. మంత్రి పదవి రేసులో రాఘవ్ చద్దా, సునీల్ జాఖడ్, తరుణ్ చుగ్ పేర్లు వినిపిస్తున్నాయి.గత కొన్ని సంవత్సరాలుగా మణిపూర్ హింసాత్మక జ్వాలల్లో నలిగిపోతోంది. ఇక్కడ మైతేయి, కుకీ వర్గాల మధ్య జాతి సంఘర్షణలకు పెద్ద చరిత్రే ఉంది. ఈ అంశంపై ప్రతిపక్షాలు వీధుల నుంచి పార్లమెంట్ వరకు మోదీ ప్రభుత్వంపై విమర్శల దాడి

# ఆరుద్ర కార్తె వచ్చినా..వాన జాడేది

హైదరాబద్, జూన్ 25 మధ్య పసిఫిక్ మహాసముద్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎల్ నినో ప్రభావం వల్ల వానాకాలంలో వానల జాడ కానరావడం లేదు. మృగశిర కార్తె ముగిసి ఆరుద్ర కార్తె ప్రవేశించినా ఆకాశంలో కారు మబ్బులు కనిపించడం లేవు. ఇటీవల కురిసిన తొలకరి వర్షంతో పులకరించిన రైతన్న వానకాలం సాగుకు సిద్ధం చేసిన పొలాల్లో పత్తి, కంది వంటి పంటల విత్తనాలు తొందరపడి భూమిలో విత్తారు. అయితే భూమిలో విత్తనాలు విత్తిన తర్వాత వాన దేవుడు ముఖం చాటేశాడు.

దీంతో రైతన్నలు వర్షం కోసం ప్రతిరోజూ ఆకాశం వైపు చూసున్నా వరుణ దేవుడు మాత్రం కనిపించడం లేదు. దీంతో రైతన్న కన్నీరుమున్నీరు అవుతున్నాడు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు విస్తరించినా సీజన్ ఆరంభంలోనే తీవ్ర వర్షపాత లోటు ఏర్పడింది. మధ్య పసిఫిక్ మహాసముద్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎల్ నినో ప్రభావం వల్ల రైతులు ఆందోళన చెం దుతున్నారు.ఎల్నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురుస్తాయని తొలకరి వర్షానికి రైతులు ఎవరూ పంటలు సాగు చేయవద్దని వ్యవసాయశాఖ అధికారులు సూచించినప్పటికీ రైతులు తొందరపడి అక్కడక్కడ పావుల వంతు భూమిలో విత్తనాలు విత్తారు. విత్తనాలు విత్తని రైతులు అదును దాటిపోతుందని ఆందోళన చెందుతున్నారు. విత్తిన రైతులు సాగు కోసం ఖర్చు చేసిన పెట్టుబడులు బూడిదలో పోసిన పన్నీరేనా అని కుమిలిపోతున్నారు.మరోవైపు ఎల్నినో ప్రభావం 2027 వరకు కొనసాగుతుందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్(ఇన్కోయిస్) ఎల్ నినోపై తాజాగా బులెటిన్ విడుదల చేసింది. ఇందులో 2026 జూన్ నుంచి 2027 ఫిబ్రవరి ఎల్నినో ప్రభావం కొనసాగుతుందని అంచనా వేశారు. ఈ అవకాశం 70 నుంచి 90 శాతం మధ్య ఉందని, ఆ సంస్థ తెలిపింది. సముద్రంలోవాతావరణ పరిస్థితుల్లో మార్పులు అంత వేగంగా రానప్పటికీ 2027 రుతుపవన కాలం కూడా దీని వల్ల ప్రభావితమయ్యే అవకాశం ఉందని అన్నారు. ప్రస్తుతం పరిణామాల దృష్ట్యా చాలా వరకు ఇది జరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా 2026 జూన్ నుంచి 2027 ఫిబ్రవరి వరకు ఉండే కాలంలో ఎల్ నినో అనేది ఈఎన్ఎస్వో దశగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.ఎల్నినో వల్ల ఉత్తర హిందూ మహాసముద్రం అంతటా సముద్ర పరిస్థితులు ప్రభావితం కానున్నాయి. దీని ఫలితంగా అధిక సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు, సముద్ర ఉపరితల భాగంలో ఉష్ణ పరిమాణం పెరగడం, సముద్ర వడగాడ్పులు పెరగడం వంటివి సంభవిస్తాయని వాతావరణ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పరిస్థితులు బంగాళాఖాతం, అరేబియా సముద్రంలోని సముద్ర వాతావరణ వ్యవస్థలు, మత్స్య సంపద, తీరప్రాంత పర్యావరణాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు.

## మంత్రి నారా లోకేష్ ను కలిసి ఏపీ స్టార్ షట్లర్ సాత్విక్ సాయిరాజ్

ఉండవల్లి: ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్ ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తూ దేశానికి, ాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన సాత్విక్ సాయిరాజ్ ను ఈ సందర్భంగా మంత్రి లోకేష్ అభినందించారు. ఏపీలోని అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన సాత్విక్ సాయిరాజ్ అర్జున అవార్డుతో పాటు దేశ అత్యున్నత క్రీడా పురస్కారం మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డు పొందారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ ఎన్నో పతకాలు సాధించారు. ప్రస్తుతం పురుషుల డబుల్స్ విభాగంలో ప్రపంచ ర్యాంకింగ్స్లో 4వ స్థానంలో ఉన్నారు. 2023 అక్టోబర్ 10న డబుల్స్ విభాగంలో ప్రపంచ నంబర్-1 ర్యాంకును సాధించారు. ఇటీవల జరిగిన థామస్ కప్ లో గోల్డ్ మెడల్ సాధించడం పట్ల మంత్రి లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్ లో సాత్విక్ సాయిరాజ్ మరిన్ని విజయాలు సాధించాలనిఈసందర్భంగామంత్రి ఆకాంక్షించారు. ప్రభుత్వపరంగా అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, ఎండీ ఎస్.భరణి పాల్గొన్నారు.

# 24 గంటల్లో 300 మి.మీ. వర్షపాతం!

ముంబై, జూన్ 25, దేశంలోని పలు రాష్ట్రాలను భారీ వర్షాలు, వరదలు వణికిస్తున్నాయి. అటు ఈశాన్య రాష్ట్రం అరుణాచల్ ప్రదేశ్ను హఠాత్తుగా వచ్చిన వరదలు ముంచెత్తగా.. ఇటు దేశ ఆర్థిక రాజధాని ముంబైని రికార్డు స్థాయి వర్షపాతం అతలాకుతలం చేస్తోంది. కొండచరియలు విరిగిపడటం, నదులు ఉప్పొంగడంతో పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. రహదారులు, వంతెనలు కొట్టుకుపోవడంతో ప్రజాజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. అరుణాచల్ ప్రదేశ్లో కురిసిన అతిభారీ వర్షాలు ఊహించని జలప్రళయాన్ని సృష్టించాయి. ముఖ్యంగా కేయీ పన్యోర్, లోయర్ సుబన్సిరి జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం తీవ్రంగా ఉంది. ఈ ప్రాంతాల్లో భారీగా కొండచరియలు విరిగిపడటంతో పాటు ఒక్కసారిగా ఫ్లాష్ ఫ్లడ్స్ సంభవించాయి. యాజలి, పోసా, యియీ వంటి గ్రామాలు పూర్తిగా వరద నీటిలో మునిగిపోయాయి. వందలాది ఇళ్లు, వేల ఎకరాల్లో సాగు చేసిన వ్యవసాయ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పోసాలోని కాలనీలో సుమారు 15 నివాస గృహాలు వరద ఉద్ధృతికి పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఓ ప్రధాన రహదారి వంతెన వరద నీటిలో కొట్టుకుపోవడంతో పలు ప్రాంతాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.తక్కువ సమయంలోనే అత్యంత భారీ వర్షపాతం నమోదు కావడం వల్ల నదులలో నీటిమట్టం ఒక్కసారిగా పెరిగి ఈ ఘోర పరిస్థితి తలెత్తిందని అధికారులు చెబుతున్నారు. ఈ వరదల ధాటికి పలువురు స్థానికులు గల్లంతైనట్లు సమాచారం అందుతోంది. సహాయక బృందాలు రంగంలోకి దిగి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ సహాయక చర్యలను ముమ్మరం చేశాయి.అరుణాచల్ ప్రదేశ్లో కురుస్తున్న ఈ భారీ వర్షాల ప్రభావం దిగువన ఉన్న అసోం రాష్ట్రంపై పడే అవకాశం ఉంది. అరుణాచల్ నదుల నుంచి వచ్చే వరద నీటి వల్ల అసోంలోనూ వరద ముప్పు పొంచి ఉండటంతో అక్కడి ప్రభుత్వం తీవ్ర అప్రమత్తత ప్రకటించింది. ప్రజలు ఎవరూ నదీ తీర ప్రాంతాలకు వెళ్లవద్దని, అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేసింది.మరోవైపు, దేశ ఆర్థిక రాజధాని ముంబైని సైతం భారీ వర్షాలు ముంచెత్తాయి. మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా నవీ ముంబైతో పాటు నగరంలోని పలు కీలక ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. ప్రసిద్ధ దాదర్ స్టేషన్లో రైలు పట్టాలపై భారీగా నీరు నిలిచిపోవడంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బస్టాండ్లు, ప్రధాన కూడళ్లు నీట మునిగాయి. అనేక చోట్ల రహదారులపై మోకాళ్ల లోతు వరద నీరు ప్రవహిస్తుం డటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ మైళ్ల మేర నిలిచిపోయింది. గడిచిన 24 గంటల్లోనే నగరంలో ఏకంగా 300 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (ఃఓఅ) వెల్లడించింది.

ముంబైలోని పలు ప్రాంతాలకు వాతావరణ శాఖ అత్యంత ప్రమాదకరమైన 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. రాబోయే మరో రెండు రోజుల పాటు నగరంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని, మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ సహాయక చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది.

## పెద్దవంగలి గ్రామంలో రైతన్న మీకోసం"

చాగలమర్రి ఈ రోజు చాగలమర్రి మండలంలోని పెద్దవంగలి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసులు, మండల వ్యవసాయ అధికారి రంగ నేతాజీ ఆధ్వర్యంలో "రైతన్న మీకోసం" కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ప్రభుత్వం రైతుల అభివృద్ధి కొరకు సబ్సిడీ ద్వారా బిందు మరియు తుంపర సేద్య పరికరాలు అందించడం, వ్యవసాయ పనిముట్లు, ఏ. పి. ఏ. ఐ. ఎం.ఎస్ ఆప్ ద్వారా రైతులకు పంటకు శాస్త్రవేత్తల సిఫార్సు మేరకు ఎరువుల పంపిణీ, రైతు విశిష్ట సంఖ్య నమోదు, ఎల్ నినో ప్రభావం వలన వర్షాభావ పరిస్థితుల్లో రైతులు తక్కువ నీటితో పండే పంటలు సాగు చేసుకోవడం, సూక్ష్మ నీటి సాగు పద్ధతులు పాటించడం, వర్షపు నీటిని నిల్వచేసుకోవడానికి ఫార్మ్ పాండ్ లను ఏర్పరచుకోవడం వంటి వివిధ ప్రభుత్వ పథకాల గురించి వివరించారు.

## సబ్ జైలు నుంచి ఖైదీ పరారీ

కాకినాడ పెద్దాపురం సబ్జైలు నుంచి రిమాండ్ ఖైదీ పరారీ కావడం కలకలం రేపింది. బైక్ దొంగతనం కేసులో రిమాండ్లో ఉన్న పోతుల సుందరం అదృశ్యం అయ్యాడు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో పోలీసులు ఖైదీని పట్టుకున్నారు.జైలు సిబ్బంది సహకారంతోనే పరారయ్యాడా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఖైదీ జైలు క్యాంటీన్లోనే దాక్కున్నాడని అధికారుల వివరణ.ఘటనపై సీసీ కెమెరా ఫుటేజీలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఖైదీ జైలు నుంచి ఎలా బయటకు వెళ్లాడన్న దానిపై విచారణ కొనసాగుతోంది.

## మంత్రి ఆగ్రహం

ఏలూరు నూజివీడు మండలం తుక్కులూరు గ్రామంలో ఐ సి డి ఎస్ శాఖకు చెందిన కోడిగుడ్ల అక్రమ రవాణాను రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారధిపటు కున్నారు. విషయంపై రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు సంధ్యారాణి కి పిర్యాదు చేసారు. ఐసిడిఎస్ కోడిగుడ్ల అక్రమ రవాణాపై విచారణ చేసి , అక్రమ రవాణాదారుల పై చర్యలు తీసుకొని కాంట్రాక్టును రద్దు చేయాలని ఐసిడిఎస్ పీడీ ని మంతరి ఆదేశించారు.

## దేవాలయ శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే యరపతినేని

మాచవరం, పల్నాడు జిల్లా, గురజాల నియోజకవర్గం, మాచవరం మండలం, పిన్నెల్లి గ్రామం నందు శ్రీ సీతారామ వేణుగోపాల స్వామి వార్ల నూతన దేవాలయం (పునర్నిర్మాణం) శంఖుస్థాపన సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో తులత ఎమ్మెల్యే యరపతినేని కొబ్బరికాయ కొట్టి శ్రీ సీతారామ వేణుగోపాల స్వామి వార్ల నూతన దేవాలయం (పునర్నిర్మాణం) నకు శంకుస్థాపన చెయ్యటం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# దారుస్సాలామ్ కి ఏమైంది..

హైదరాబాద్ జూన్ 25  దారుస్సలామ్.. హైదరాబాద్‌లో ఈ పేరు తెలియనివారు ఉండరు. ఎంఐఎం పార్టీ కేంద్రకార్యాలయమే దారుస్సలామ్. ఒకప్పుడు .. ఈ కార్యాలయం వచ్చిపోయే వారితోనే కాదు.. పార్టీ కార్యకర్తలు, నాయకులతో నిండుగా కిక్కిరిసి ఉండేది. తమ సమస్యలు చెప్పుకొనే వారు కూడా పెద్ద ఎత్తున తరలి వచ్చే వారు. పార్టీ చీఫ్.. అసదుద్దీన్ ఓవైసీ ఉన్నా.. లేకపోయినా.. పార్టీ కార్యాలయం మాత్రం నిండుగా కనిపించేది. ముఖ్యంగా యువత ఎక్కువగా ఇక్కడ తిష్ఠవేసుకుని పార్టీ కోసం పనిచేసిన పరిస్థితి కూడా ఉండేది. కానీ.. గత రెండు మాసాలుగా దారుస్సలామ్ బోసిపోయిన పరిస్థితిని నెలకొంది. వచ్చేవారు లేరు. వచ్చినా.. ఇక్కడ సమాధా నం ఇచ్చేవారుకూడా లేకుండా పోయారన్న వాదన వినిపిస్తోంది. హైదరాబాద్ ఎంపీగా అసదుద్దీన్ ప్రాతినిధ్యం వహిస్తున్నా.. జాతీయ రాజకీయాలపై ఆయన ఎక్కువగా దృష్టి పెట్టారు. యూపీ సహా.. ఇతర రాష్ట్రాల్లో ఎక్కడ ఎన్నికలు జరిగినా.. ఎంఐఎం జాడలు కనిపిస్తూనే ఉన్నాయి. ఇటీవల జరిగిన పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లోనూ ఎంఐఎం పోటీ చేసింది. గతంలో బీహార్‌లోనూ పార్టీ పోటీ ఇచ్చింది.దీంతో అసదుద్దీన్.. జాతీయ రాజకీయాలపైనే ఎక్కువగా దృష్టి పెట్టారని తెలుస్తోంది. ఇక, ఆయన సోదరుడు, ఎమ్మెల్యే అక్బరు ద్దీన్ .. కేవలం అసెంబ్లీ సమావేశాలు ఉన్నప్పుడే కనిపిస్తున్నారని సమాచారం. ఎక్కువ భాగం.. విదేశాల్లోనే ఉంటున్నారని పార్టీ నాయకులు చెబుతున్నారు. దీంతో పార్టీకార్యాలయంలో కార్యక్రమాలు మందగించాయి. అదేసమయంలో వచ్చిపోయే వారి సంఖ్య కూడా తగ్గిపోయింది. ఇదిలావుంటే.. హైదరాబాద్ పాతబస్తీ రాజకీయాల్లో ఎంఐఎం పార్టీకి ఏళ్ల తరబడి తిరుగులేదన్న వాదన తెలిసిందే అంతేకాదు.. భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో ఓవైసీ కుటుంబానికి చెందిన నాల్గవ తరం వారసుడు అక్బరుద్దీన్ ఓవైసీ కుమారుడు నూరుద్దీన్ ఓవైసీ రాజకీయ రంగప్రవేశం చేస్తారన్న ప్రచారం కూడా ఉంది. కానీ, ఆ జాడ కూడా ఎక్కడా కనిపించడం లేదు. మరోవైపు.. కాంగ్రెస్ పార్టీ ఇదే పాత బస్తీకి చెందిన మరో పార్టీకి అండగా ఉంటున్నదన్న సమాచంర హల్చల్ చేస్తోంది. దీంతో ఎంఐఎం ప్రభ తగ్గుతోందా? అనేది చర్చకు దారితీసింది. ఇక, జాతీయస్థాయిలో దృష్టి పెట్టినా.. ఎంఐఎంకు అనుకున్నంత మైలేజీ లేకుండా పోయిందన్న వాదన వినిపిస్తోంది. ఇలా.. స్థానికంగా దృష్టి పెట్టకపోవడం, ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్ననేపథ్యంలో దారుస్సలామ్‌లో జనాల తాకిడి తగ్గిపోగా.. పార్టీకి ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయని అంటున్నారు పరిశీలకులు. దీనిని సరిచేసుకుంటారా? లేక... ఇంతే అని వదిలేస్తారో చూడాలి.

# మొక్కజొన్న రికార్డ్ ధర....

వరంగల్, జూన్ 25  వరంగల్‌లోని ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం మొక్కజొన్న పంటకు రికార్డు స్థాయిలో క్వింటాకు రూ.2310 ధర లభించింది. ప్రభుత్వ మద్దతు ధర రూ.2400 కు సమానంగా ప్రైవేటు వ్యాపారులు ఈ స్థాయిలో ధర పలకడం ఇదే తొలిసారి అని మార్కెట్ అధికారులు తెలిపారు. పర్వతగిరి మండలం చింతనెక్కొండ గ్రామానికి చెందిన రైతు మామిండ్ల దేవేందర్ తన రెండెకరాల్లో పండించిన 72 క్వింటాళ్ల మొక్కజొన్నను ఈ ధరకు విక్రయించి భారీ లాభాలు గడించారు. ప్రభుత్వ మార్క్‌ఫెడ్ కేంద్రాల్లో కొనుగోళ్ల జాప్యం కారణంగా పంటను ఇంట్లోనే నిల్వ ఉంచిన రైతుకు.. ఓపెన్ మార్కెట్లో ఈ ఊహించని భారీ ధర లభించడంతో హర్షం వ్యక్తమవుతోంది.ఆసియాలోనే అతిపెద్ద వ్యవసాయ మార్కెట్లలో ఒకటిగా పేరుగాంచిన వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో సరికొత్త రికార్డు నమోదైంది. మంగళవారం జరిగిన పంట కొనుగోళ్లలో మొక్కజొన్న పంటకు మార్కెట్ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా అత్యధిక ధర లభించింది. ప్రైవేటు వ్యాపారులు పోటీ పడి మరీ క్వింటా మొక్కజొన్నకు గరిష్ఠంగా రూ.2,310 ధర చెల్లించి కొనుగోలు చేశారు. ఓపెన్ మార్కెట్లో ఇంత భారీ మొత్తంలో ధర పలకడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది సాధారణంగా వచ్చే ధరల కంటే ఇది చాలా ఎక్కువ కావడం విశేషం.జిల్లాలోని పర్వతగిరి మండలం చింతనెక్కొండ గ్రామానికి చెందిన రైతు మామిండ్ల దేవేందర్‌కు ఈ రికార్డు ధర దక్కింది. ఆయన తనకున్న రెండెకరాల భూమిలో రూ.50 వేల పెట్టుబడితో మొక్కజొన్న సాగు చేశారు. వాతావరణం అనుకూలించడంతో పాటు సరైన యాజమాన్య పద్ధతులు పాటించడంతో రైతుకు ఎకరాకు ఆశించిన దానికంటే మంచి దిగుబడి వచ్చింది. మొత్తం రెండెకరాల నుంచి 72 క్వింటాళ్ల మొక్కజొన్న దిగుబడి సాధించారు. ఈ పంట సరుకును మంగళవారం ఎనుమాముల మార్కెట్‌కు తీసుకురాగా.. అక్కడి ప్రైవేటు వ్యాపారులు నాణ్యతను పరిశీలించి క్వింటాకు రూ.2,310 చొప్పున మొత్తం పంటను కొనుగోలు చేశారు. పెట్టుబడితో పోలిస్తే రైతు దేవేందర్‌కు ఊహించని రీతిలో భారీ లాభం చేకూరింది.నిజానికి, ప్రభుత్వం ప్రకటించిన మొక్కజొన్న మద్దతు ధర క్వింటాకు రూ.2,400 గా ఉంది. అయితే ప్రభుత్వ సంస్థ అయిన మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేసిన అధికారిక కొనుగోలు కేంద్రాల్లో సరుకు సేకరణ ప్రక్రియ తీవ్ర జాప్యంగా సాగుతోంది. టెక్నికల్ సమస్యలు, ఇతర కారణాల వల్ల కొనుగోళ్లు ఆలస్యం అవుతుండటంతో రైతు దేవేందర్ ఇంతకాలం తన పంటను ఇంట్లోనే నిల్వ చేసుకున్నారు. మార్కెట్లో డిమాండ్ పెరిగే వరకు వేచి చూశారు. ప్రభుత్వ కేంద్రాల ఆలస్యం కారణంగానే తాను పంటను ఇంట్లో దాచుకోవాల్సి వచ్చిందని,..కానీ ఇప్పుడు ఓపెన్ మార్కెట్లోనే మద్దతు ధరకు కేవలం 90 రూపాయల తక్కువతో మంచి ధర రావడం చాలా సంతోషంగా ఉందని సదరు రైతు వెల్లడించారు.ప్రభుత్వ మద్దతు ధర రూ.2400 కు అత్యంత సమీపంగా ప్రైవేటు వ్యాపారులు రూ.2,310 లు వెచ్చించి మొక్కజొన్నను కొనుగోలు చేయడం ఇదే తొలిసారని ఎనుమాముల మార్కెట్ ఉన్నతాధి, కారులు స్పష్టం చేశారు. సాధారణంగా మార్కెట్ సీజన్ ప్రారంభంలో వ్యాపారులు తక్కువ ధరలకే కొనుగోలు చేస్తుంటారని కానీ ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు, నాణ్యమైన దిగుబడి కారణంగానే ఈ రికార్డు ధర సాధ్యమైందని వివరించారు. రాబోయే రోజుల్లో మిగిలిన రైతులకు కూడా ఇదే తరహాలో మంచి ధరలు లభించే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## ఇరవై రోజుల్లో వీటి ధరలు

## 15 శాతం నుంచి 20శాతం

హైదరాబాద్, జూన్ 25 పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా పేద, మధ్య తరగతి వర్గాలపై ఇప్పటికే గ్యాస్, ఇంధన, నిత్యావసర సరకుల ధరల భారం పడింది. వీటి ధరలు పెరగడంతో ఆయా వర్గాల ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆయా వర్గాలకు మరో బిగ్ షాక్ తగిలింది. ప్రస్తుతం సన్నబియ్యం ధరలు కూడా భారీగా పెరుగుతున్నాయి.గడిచిన ఇరవై రోజుల్లో వీటి ధరలు ఏకంగా 15 శాతం నుంచి 20శాతం వరకు పెరిగినట్లు వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా జేఎస్ఆర్, ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ, బీపీటీ రకాలపై ఈ ప్రభావం భారీగా కనిపిస్తోంది. గతంలో కిలో రూ. 46 నుంచి రూ.55 ఉంటే.. ఇప్పుడు స్టీం, రారైస్ తక్కువ రకం, ప్రీమియం క్వాలిటీని బట్టి రూ.55 నుంచి రూ.63 వరకు చేరాయి. పావుకిలో బియ్యం బ్యాగ్ పై సుమారు రూ. 180 నుంచి రూ.200 పెరుగుదల చోటు చేసుకుంది.

సన్నబియ్యం ధరలు పెరగడానికి ప్రధాన కారణాలివే..

? తెలంగాణలో ప్రభుత్వం సన్నాలకు రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఖరీఫ్ లో సాగైన పంట ఉత్పత్తులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు భారీగా వెళ్లాయి. ప్రభుత్వం వద్ద అవసరానికి మించిన సుమారు 10లక్షల టన్నుల నిల్వలు ఉన్నట్లు తెలుస్తోంది. కొన్ని నెలలుగా ఈ ధాన్యం మార్కెట్లోకి రాకపోవటంతో బియ్యం కొరత ఏర్పడింది.

? ఉత్తర ప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ వంటి పలు రాష్ట్రాల్లో గతంకంటే సన్నాల సాగు తగ్గినట్లు మిలర్లు, బియ్యం వ్యాపారులు చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో దిగుబడులు భారీగా తగ్గాయి.

? తుంగభద్ర డ్యాంకు మరమ్మతుల కారణంగా కర్ణాటక ప్రభుత్వం ఆయా ప్రాంతాల్లో యాసంగిలో పంటకు విరామం ప్రకటించింది. ఫలితంగా అక్కడి వ్యాపారులు తెలంగాణలోని నిజామాబాద్, బాన్సువాడ, బోధన్, నారాయణపేట, గద్వాల ప్రాంతాల నుంచి పెద్దమొత్తంలో సన్నధాన్యం కొనుగోళ్లు జరిపి ఆ రాష్ట్రంలోని వివిధ నగరాలకు తరలించారు. దీంతో ఇక్కడ సన్నధాన్యం కొరత ఏర్పడింది.

? ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ చెబుతోంది. ఈ క్రమంలో మిల్లర్లు పెద్దమొత్తంలో సన్నధాన్యం నిల్వ చేస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని.. ఫలితంగా సన్న ధాన్యం కొరత ఏర్పడిందని చెబుతున్నారు.

? తెలంగాణలో ఐదు లక్షల టన్నుల సన్న ధాన్యం వేలం పూర్తయ్యి ఈ నిల్వలు త్వరగా మార్కెట్లోకి వస్తే ధరలు తగ్గే అవకాశం ఉందని బియ్యం ఎగుమతిదారులు పేర్కొంటున్నారు.

## తెలంగాణ రక్షణ సేన నాయకులపై  కాంగ్రెస్ నేతల దాడి

ములుగు గోదావరిలో ఇసుక తవ్వకాలను పరిశీలించేందుకు ఏటూరునాగారం వెళ్లిన టీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నేతలు దాడికి దిగారు. క్వారీల వరకు వెళ్లకుండా అడ్డుకొని దాడి చేసారు. దాడికి పాల్పడిన వారు మంత్రి సీతక్క అనుచరులని టీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. సీతమ్మ సాగర్ మల్టీ పర్పస్ ప్రాజెక్టు ముంపు పేరుతో ములుగు జిల్లా మంగపేట మండలం వాడగూడెంలో గోదావరి నదిలో భారీ ఎత్తున ఇసుక తవ్వకాలు జరగుతున్నాయి. తెలంగాణ రక్షణ సేన నాయకులు ఇసుక తవ్వకాలను పరిశీలించేందుకు బుధవారం మధ్యాహ్నం వెళ్లారు. టీఆర్ఎస్ నాయకులను అడ్డుకొని దాడికి తెగపడ్డ రు. వీడియోలు తీస్తున్న సెల్ ఫోన్లు లాక్కొని విసిరేసారు. గోదావరి నది నుంచి వెళ్లిపోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటామని హెచ్చరించారు.

# ఎవరీ అనంతపురం జగన్?..

హైదరాబాద్, జూన్ 25  బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి గురించి అనంతపురానికి చెందిన స్వప్న మాట్లాడిన వీడియో వైరల్ అవుతోంది. ఆమె తన ప్రసంగంలో జగన్ సార్ అంటూ ఓ పేరును ప్రస్తావించారు. అందరూ మాజీ సీఎం జగన్ గురించి అనుకుని పొరపడ్డారు.. కానీ ఆమె ప్రస్తావించింది అనంతపురం జగన్ పేరు. అసలు ఇంతకీ ఎవరీ అనంతపురం జగన్.. నందమూరి బాలయ్యకు ఎందుకంత దగ్గరయ్యారు.తెలుగు రాష్ట్రాల్లో క్యాన్సర్ బాధితులకు 25 ఏళ్లుగా విశేష సేవలందిస్తున్న బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంతోమంది నిరుపేదలు ఈ ఆస్పత్రిలో చికిత్సపొంది ప్రాణాంతక క్యాన్సర్‌ను జయించారు. బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో నిర్వహించిన రజతోత్సవ వేడుకల్లో క్యాన్సర్‌ను జయించిన కొందరు తమ అనుభవాలను పంచుకున్నారు. ఇది ఆస్పత్రి కాదు, ఓ దేవాలయం, పునర్జన్మ ప్రసాదించారంటూ ఎమోషనల్ అయ్యారు. అనంతపురానికి చెందిన స్వప్న అనే యువతి క్యాన్సర్ నుంచి ఎలా బయటపడ్డారో చెబుతూ చేసిన ప్రసంగం వైరల్ అవుతోంది. ఆ యువతి బసవతారకం ఆస్పత్రిలో చికిత్సపొందడానికి సాయం చేసినవారి పేరు చెబుతూ జగన్ సార్ అంటూ ప్రస్తావించారు. స్వప్న జగన్ పేరు ప్రస్తావించడంతో సోషల్ మీడియాలో ఆ వీడియో వైరల్ అయ్యింది. ఆ యువతి చెప్పింది మాజీ సీఎం జగన్ గురించి అనుకుని కొంతమంది వైఎస్సార్‌సీపీ అభిమానులు పొరపాటుపడ్డారు. కానీ ఆమె అక్కడ ప్రస్తావించింది మాత్రం అనంతపురం జగన్ అలియాస్ జగదీష్ పేరు.. నందమూరి బాలకృష్ణకు వీరాభిమాని, అత్యంత నమ్మకస్తుడు.సోషల్ మీడియాలో బాలయ్య వీరాభిమాని అనంతపురం జగన్ పేరు వైరల్ కావడంతో సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ఇంతకీ ఎవరీ జగన్.. బాలయ్యకు ఎలా అంత దగ్గరయ్యారని ఆరా తీస్తున్నారు. ఆయన అసలు పేరు జగదీష్ అలియాస్ అనంతపురం జగన్.. నందమూరి బాలకృష్ణకు వీరాభిమాని. కేవలం అభిమాని మాత్రమే కాదు.. బాలయ్యపై అభిమానంతో 'ఔఃఐ ఊవశ్రీజూతినిణ ఊజీనిటబ' పేరుతో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు, పేదలకు సహాయం చేస్తున్నారు. బాలకృష్ణ స్ఫూర్తితో ఎన్‌బీకే హెల్పింగ్ హ్యాండ్స్‌ను ఏర్పాట్లు చేసినట్లు జగన్ చెబుతుంటారు. తన తండ్రి 2004లో చనిపోయారని.. ఆ స్థానంలో బాలయ్య తన కుటుంబానికి అండగా ఉన్నారని జగన్ ఎన్నో సందర్భాల్లో చెప్పారు.

నందమూరి బాలయ్య ఏ ఈవెంట్‌కు వెళ్లినా, ఏ కార్యక్రమానికి హాజరైనా వెంట అనంతపురం జగన్ ఉంటారు. ఎన్నో సందర్భాల్లో బాలయ్య జగన్ పేరును ప్రస్తావించారు. ప్రతి ఏటా బాలయ్య పుట్టినరోజును ప్రత్యేకంగా నిర్వహిస్తారు.. ప్రత్యేకంగా పాటలు (సిగ్నేచర్ సాంగ్స్) రూపొందించి విడుదల చేస్తుంటారు. ఆయన ఈ నెల 10న బాలయ్య పుట్టినరోజు వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. 'భోళా బాలయ్య' అంటూ ప్రత్యేంగా ఓ పాటను తీసి విడుదల చేశారు. జూన్ 1 నుంచి 10 వరకు వేడుకల్ని నిర్వహించి అభిమానాన్ని చాటుకున్నారు. అనంతపురం జగన్‌కు బాలయ్య అభిమానుల్లో కూడా మంచి ఫాలోయింగ్ ఉంది.బాలయ్యకు ఫ్యాన్స్ ఉండరు.. భక్తులు ఉంటారని చెబుతుంటారు అనంతపురం జగన్. ఆయన స్ఫూర్తితో అనంతపురం జగన్ ఎంతోమంది బాలకృష్ణ అభిమానులకు సాయం చేశారు.. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అనంతపురానికి చెందిన స్వప్నకు కూడా జగన్ సాయం చేశారు. స్వప్న పదోతరగతి చదువుతున్నప్పుడు బోన్ క్యాన్సర్ బయటపడింది. ఆమెను ఎన్నో ఆస్పత్రులకు తీసుకెళ్లారు.. కానీ ఆమె కోలుకోలేదు. అప్పుడు అనంతపురం జగన్‌కు విషయం తెలిసింది.. స్వప్న ఇంటికి వెళ్లి పరామర్శించారు.

బాలయ్యకు స్వప్న పరిస్థితి గురించి చెప్పి బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో చేర్పించారు. నందమూరి బాలకృష్ణ స్వప్నకు అందించిన వైద్య చికిత్సను స్వయంగా పర్యవేక్షించారు. ఆమె క్యాన్సర్ జయించారు.. తనకు పునర్జన్మ ప్రసాదించిన బసవతారకం ఆసుపత్రికి, నందమూరి బాలకృష్ణకు, అనంతపురం జగన్‌కు స్వప్న ధన్యవాదాలు తెలిపారు.

# గల్ఫ్ దేశాల్లో బ్లూ కాలర్ ఉద్యోగాలు

హైదరాబాద్, జూన్ 25  రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై విదేశాల్లో ఉంటున్న తెలుగు ప్రవాసీయులకు కనీస అవగాహన లేదని సౌదీ అరేబియా తెలుగు అసోసియేషన్ వెల్లడించింది. వారి ఓటు హక్కును కాపాడేందుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని కోరింది. గల్ఫ్ దేశాల్లో ఉన్న దాదాపు 8 నుంచి 10 లక్షల మంది తెలుగు వారిలో అత్యధికులు బ్లూ కాలర్ కార్మికులేనని.. వారికి ఈ ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు డిజిటల్ సదస్సులు నిర్వహించాలని సాటా జనరల్ సెక్రటరీ ముజమ్మిల్ షేక్ డిమాండ్ చేశారు. దేశంలోని ఓటర్ల జాబితా సవరించడం కోసం కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ సర్వే తెలంగాణలో ప్రారంభం కానుంది. పలు రాష్ట్రాల్లో ఇప్పటికే సర్వే పూర్తి కాగా.. తెలుగు రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాను సవరించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. ఈ ప్రత్యేక సమగ్ర సవరణ సర్వే విదేశాల్లో నివసిస్తున్న తెలుగు ప్రవాసీయులలో ఆందోళనకు కారణమవుతోంది. మరీ ముఖ్యంగా తెలంగాణ నుంచి చాలా మంది గల్ఫ్ దేశాల్లో బ్లూ కాలర్ ఉద్యోగాలు చేస్తున్నారు. దీంతో ఉపాధి కోసం వెళ్లిన లక్షలాది మంది తెలుగు ప్రజలకు ఈ ఓటర్ల నమోదు, జాబితా వెరిఫికేషన్ ప్రక్రియపై సరైన సమాచారం లేకపోవడంతో వారు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని సౌదీ అరేబియా తెలుగు అసోసియేషన్ (సాటా) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ప్రవాస తెలుగు వారి రాజకీయ, ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు రెండు రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధప్రాతిపదికన చొరవ చూపాలని అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.ఈ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించి ఏపీలో జులై 14వ తేదీ వరకు గడువు విధించగా.. తెలంగాణలో జులై 24వ తేదీ వరకు ఈ సవరణల ప్రక్రియ కొనసాగనుంది. ఈ విషయమై సాటా జనరల్ సెక్రటరీ ముజమ్మిల్ షేక్ మాట్లాడుతూ.. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి దాదాపు 8 నుంచి 10 లక్షల మంది ప్రజలు విదేశాల్లో నివసిస్తున్నారని అంచనా వేశారు.

అసలు సాఎఖీ అంటే ఏమిటి? ఎన్నారైలు కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలా? వివరాలు అప్‌డేట్ చేయాలా? లేదా అధికారుల నుంచి వచ్చే వెరిఫికేషన్ అభ్యర్థనలకు ఎలా స్పందించాలి? అనే విషయాలపై ఎన్నారైలకు కనీస అవగాహన లేదని ముజమ్మిల్ తెలిపారు. ఈ సమాచార లోపం వల్ల చాలా మంది దీనిని నిర్లక్ష్యం చేసే అవకాశం ఉందని.. ఇది వారి ఓటు హక్కుపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు.విదేశాల్లో ఉన్న తెలుగు వారిలో, ముఖ్యంగా గల్ఫ్ దేశాలలో నివసిస్తున్న వారిలో దాదాపు 70 శాతం మంది సాధారణ రోజువారీ కార్మికులేనని ముజమ్మిల్ షేక్ గుర్తుచేశారు. వీరికి టెక్నాలజీపై పట్టు, ఇంటర్నెట్ సౌకర్యాలు చాలా పరిమితంగా ఉంటాయన్నారు. పైగా వీరికి రెండేళ్లకు ఒకసారి మాత్రమే స్వదేశానికి వచ్చేందుకు సెలవులు లభిస్తాయని వివరించారు. కేవలం ఓటరు నమోదు సమస్యలను, వెరిఫికేషన్ ఐడెంటిటీని పరిష్కరించుకోవడం కోసం వారు అంతంత మాత్రమే ఉన్న జీతాలతో వేలాది రూపాయలు ఖర్చు పెట్టుకుని అత్యవసరంగా స్వస్థలాలకు ప్రయాణమై రావడం ఎంతమాత్రం సరైంది కాదని అన్నారు.ఈ సమస్యను అధిగమించడానికి సాటా సంస్థ ఆధ్వర్యంలో సౌదీ అరేబియాలోని తెలుగు సంఘాలు, సోషల్ మీడియా గ్రూపుల ద్వారా ప్రవాసీయులలో స్వచ్ఛందంగా అవగాహన ప్రచారాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ఓటర్ల జాబితాలో పేర్లు అలాగే కొనసాగేందుకు ఏం చేయాలనే దానిపై ఎన్నారైలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

అయితే, కేవలం స్వచ్ఛంద సంస్థల ప్రచారం సరిపోదని ప్రభుత్వాలు అధికారికంగా ప్రత్యేక అధికారులను నియమించి గల్ఫ్, ఇతర విదేశీ తెలుగు కమ్యూనిటీలతో వర్చువల్ సెమినార్లు నిర్వహించాలని సాటా కోరింది. ఆన్‌లైన్ ద్వారానే సులభంగా ఓటరు ప్రక్రియను పూర్తి చేసేలా విధివిధానాలను సులభతరం చేయాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసింది

# 52వ డివిజన్‌లో మేయర్ పర్యటన.

## స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు



గోదావరిఖని : రామగుండం కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి  99 రోజుల ప్రజా పాలన పట్టణ ప్రగతి ప్రణాళికలో భాగంగా 52వ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు.అధికారులతో సమీక్ష నిర్వహించి రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో లో డిప్యూటీ మేయర్ ఎల్లయ్య స్థానిక కార్పొరేటర్ నాగరాజు డివిజన్ ప్రజలు పాల్గొన్నారు

# కాంగ్రెస్ లో కలవరం

హైదరాబాద్, జూన్ 25 తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల ఉదాసీన వైఖరి స్పష్టంగా కనిపిస్తుంది. ఓటర్ల జాబితా సమగ్ర సవరణపై సీరియస్ నెస్ లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన హెచ్చరికలు ఇందుకు అద్దం పడుతున్నాయి. ఓటర్ల జాబితా సమగ్ర సవరణ విషయంలో ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదన్న నివేదికలు కాంగ్రెస్ నాయకత్వాన్ని కలవరానికి గురి చేస్తున్నాయి. ఈ విషయంలో బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు ఒకింత ముందంజలో ఉన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్ ఛార్జులు మాత్రం పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అందుకే రేవంత్ రెడ్డి ఉదాసీన వైఖరిని వీడకుంటే నియోజకవర్గాల్లో మరొక నేతను పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఓటర్ల జాబితా సమగ్ర సవరణ అంటే రాజకీయ పార్టీల్లో గుండెల్లో రైళ్లు పరుగులు తీస్తున్నాయి. పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో ఓటర్లను పెద్ద ఎత్తున తొలగించడం వల్లనే అక్కడ టీఎంసీ, డీఎంకేలు ఓటమి పాలయినట్లు కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ పదే పదే చెబుతున్నప్పటికీ తెలంగాణ కాంగ్రెస్ నేతల్లో మాత్రం మొద్దు నిద్ర వదల్లేదన్నది వాస్తవం. తన నియోజకవర్గంలో తామే కింగ్ ల మని భావిస్తున్నారు తప్పించి, ఓట్లను తొలగిస్తే రానున్న ఎన్నికల్లో గెలవలేమన్న వాస్తవాన్ని గ్రహించలేకపోతున్నారని రేవంత్ రెడ్డి సయితం ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. బూత్ లెవెల్ కమిటీలతో... మరొకవైపు బూత్ లెవెల్ కమిటీ సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఓటర్ల జాబితా సమగ్ర సవరణ లో ఏదైనా ఓట్లు తొలగిస్తే అభ్యంతరాలను తెలియజేసేందుకు అవసరమైన శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ పనిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో పాటు హరీశ్ రావులు జిల్లాల్లో పర్యటిస్తూ నేతలతో సమావేశమవుతూ ఓటర్ల జాబితా సమగ్ర సవరణపై వారిని అలెర్ట్ చేస్తున్నారు. కాంగ్రెస్ లో మాత్రం అధికారంలో ఉండి కూడా తమ నియోజకవర్గంలో ఓట్లను కాపాడుకునేందుకు ఏమాత్రం ప్రయత్నించకపోవడం వల్లనే రేవంత్ రెడ్డి సీరియస్ అయినట్లు సమాచారం. ఇలాగే వ్యవహరిస్తే వచ్చే ఎన్నికలలో టిక్కెట్ ఉండదని కూడా హెచ్చరించి రేవంత్ ఎమ్మెల్యేలకు ఫుల్లు వార్నింగ్ ఇచ్చారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తన శాఖపై సంతృప్తి కరంగా లేరని తెలుస్తోంది. ఉప ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ ఆర్థిక శాఖ మరింత చికాకు తెస్తుందని మల్లు భట్టి విక్రమార్క అభిప్రాయపడుతున్నారని తెలిసింది. సంక్షేమ పథకాలకు నిధులను కేటాయించడంతో పాటు వివిధ శాఖలకు చెందిన పెండింగ్ బకాయిలను విడుదల చేయడం తనకు తలనొప్పిగా మారిందని మల్లు భట్టి విక్రమార్క తన సన్నిహితుల వద్ద వాపోతున్నట్లు సమాచారం. గత ప్రభుత్వం చేసిన అప్పులతో పాటు ప్రస్తుతం తాము వడ్డీలు చెల్లించడంతో పాటు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కేటాయింపు కష్టంగా మారిందని మల్లు భట్టి విక్రమార్క భావిస్తున్నారు. సంక్షేమ పథకాలకు కోట్ల రూపాయల నిధులు విడుదల చేస్తున్నప్పటికీ ఇంకా అప్పులు తేవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆయన ఆవేదన చెందుతున్నారు. ఉద్యోగుల జీతాలతో పాటు వారికి అందాల్సిన ప్రయోజనాలను అందించడంతో తాను విఫలమవుతానన్న భయం మల్లు భట్టి విక్రమార్క లో మొదలయిందని ఆయన సన్నిహితులు కూడా అంటున్నారు. బడ్జెట్ లో కేటాయించిన నిధులను సర్దుబాటు చేయాలన్నా తలప్రాణం తోకకు వచ్చినట్లవుతుందని మల్లు భట్టి విక్రమార్క అంటున్నారని తెలిసింది. ఏదో ఒక కొత్త సమస్య రావడం, దానికి నిధులతో ముడిపడి ఉండటంతో తనకు ఈ శాఖ భారంగా మారిందని మల్లు భట్టి విక్రమార్క భావిస్తున్నారు. నెల మొదటి వారం వచ్చిందంటే చాలు భయం వేస్తుందని ఆయన ఆందోళన చెందుతున్నారు. దీంతో పాటు వివిధ సంఘాలతో వరసగా తానే సమావేశాలను ఏర్పాటు చేసి నిధుల సర్దుబాటు చేయడానికి వారిని బుజ్జగించాల్సి వస్తుందని, నిధులు సకాలంలో విడుదల చేయకపోతే మాట తప్పిన వారమవుతామని మల్లు భట్టి విక్రమార్క ఆవేదన చెందుతున్నారు. ఖజానా బోసి పోయి ఉండటం, ప్రతి నెలా అప్పులు తేవడం తనకు సమస్యగా మారిందని, వీలయినంత వరకూ త్వరలోనే ఈ శాఖను వదిలించుకోవాలన్న భావనలో మల్లు భట్టి విక్రమార్క ఉన్నట్లు చెబుతున్నారు. పేరుకు ఆర్థిక శాఖ అయినప్పటికీ ఈ శాఖ మంత్రిగా తనకు సంతృప్తి కరంగా లేదని, మరొక శాఖ అయితే తన పనితీరుతో మెప్పించే పనిని చేసేవాడినని మల్లు భట్టి విక్రమార్క తన మిత్రుల వద్ద వ్యాఖ్యానించినట్లు చెబుతున్నారు. మొత్తం మీద మల్లు భట్టి విక్రమార్క పట్టువదలని విక్రమార్కుడిలా ఆర్థిక గండం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించే ప్రయత్నం చేస్తున్నారని మంత్రులు కితాబు ఇస్తుండటం గమనార్హం.

## తెలంగాణ కాలనీలో నాలుగు హత్యల కేసులో వీడిన మిస్టరి



నల్గోండ మృతురాలు హసీనా సొంత కూతురు-అల్లుడే హత్యలు చేయించినట్టు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. సొంత కూతురుకు ఆస్తి దక్కడం లేదని కారణం తోనే హత్యలు జరిగాయి. ల్లగొండ జిల్లా కేంద్రం సాగర్ రోడ్డు తెలంగాణ కాలనీలో ఒకే కుటుంబానికి చెందిన మహమ్మద్ సుల్తాన్ (45), ఆయన భార్య హసీన (40), కుమారుడు ముజమిల్(20), కుమార్తె అక్సర (11) అనుమానాస్పద మృతి కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి హైదరాబాద్ పాతబస్తీకి చెందిన నలుగురు రౌడీ షీటర్ల చేత అల్లుడు, కూతురు హత్య చేయించారు. హసీనాకు గతంలో రెండు పెళ్లిళ్లు జరగగా.. నల్లగొండకు చెందిన మహ్మద్ సుల్తాన్ను మూడో వివాహం చేసుకుంది. సుల్తాన్కు కూడా గతంలో రెండు పెళ్లిళ్లు జరగగా.. సుల్తాన్ మొదటి భార్య పిల్లలు మహ్మద్ ముజమిల్, అక్సరతో కలిసి నల్లగొండలో హసీన కాపురం వుంటోంది.

హసీన పేరు మీద కోటి రూపాయల విలువైన స్థలాలు, ఇల్లులు ఉండడంతో.. ఆ ఆస్తిని తమకు ఇవ్వకుండా తన మూడో భర్త అయిన సుల్తాన్ పిల్లల మీద వీలునామా రాస్తున్నట్లు హసీనా చెప్పడంతో కక్ష పెంచుకొని, హసీన మొదటి భర్త కూతురు, అల్లుడు కలిసి ఈ ఘాతుకానికి పాల్పడ్డట్లు పోలీసులు నిర్ధారించారు.

పోస్టుమార్టం నివేదిక ప్రకారం.. సుల్తాన్ మృతదేహం పై 6 చోట్ల కత్తి గాయాలు ఉండగా, హసీనాకు 7 చోట్ల, కుమార్తె అక్సరకు 9 చోట్ల, ముజమిల్కు ఏకంగా 16 కత్తిపోట్లు ఉన్నట్లు గుర్తించారు. హంతకులకు భయపడి 11 ఏళ్ల అక్సర మంచం కింద దాక్కుంటే ఆమెను బయటకు లాగి చంపి ఉంటారని.. ఆమె మృతదేహం సగం మంచం కింద ఉండటాన్నిబట్టి అనుమానిస్తున్నారు.

# మ్యాంగో జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద విషాదం



చిత్తూరు మామిడి లోడ్ ట్రాక్టర్ కింద పడి మామిడి రైతు మృతి చెందాడు. గుడిపాల మండలం సీకే పల్లి మాంగో జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద బుధవారం రాత్రి ప్రమాదం జరిగింది. యాదమరి మండలం కొట్టాల గ్రామానికి చెందిన అనిల్ మామిడి లోడ్ ట్రక్ కింద నిద్రిస్తుండగా.. అతని తమ్ముడు గమనించకుండా ట్రాక్టర్ స్టార్ట్ చేయడంతో అనిల్ మృతి చెందాడు. అనిల్ మృతితో మామిడి రైతు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అవుతున్నారు.

## మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి: సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి




కరీంనగర్ )అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కరీంనగర్ జిల్లా పోలీస్, సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈగల్ టీమ్‌ను ఏర్పాటు చేసి మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపడుతోందని తెలిపారు. డ్రగ్స్ వల్ల వ్యక్తిగత, కుటుంబ సామాజిక జీవితాలపై తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొంటూ, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.

## అంబట్ పల్లిలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్.





జయశంకర్ భూపాలపల్లి.జూన్ 25: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం లోని అంబటిపల్లి గ్రామంలో అక్రమ కార్యకలాపాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ మరియు నేరాల నివారణ లక్ష్యంగా గురువారం తెల్లవారుజామున పోలీసులు విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ ( నాకాబంది ) ఆపరేషన్ నిర్వహించారు. కాటారం డీఎస్పీ సూర్యనారాయణ ఆదేశాల మేరకు మహదేవ్‌పూర్ సీఐ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో, మహదేవపూర్ ఎస్‌హెచ్ ఓ సాంబమూర్తి, మహదేవ్‌పూర్ ఎస్ఐ జె. రమేష్ , కాళేశ్వరం ఎస్ఐ భగవంత్,పలిమేల ఎస్ ఐ సాయి శశాంక్, మరియు పోలీసు సిబ్బంది గ్రామాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని ఇంటింటి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అనుమానిత వ్యక్తులు, నేరచరిత్ర కలిగిన వ్యక్తుల వివరాలను సేకరించి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలో భాగంగా 30 లీటర్ల గుడుంబాను సీజ్ చేసారు, మొత్తం 65 వాహనాలను తనిఖీ చేయగా, నంబర్ ప్లేట్లు లేని 6 వాహనాలను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు మరియు ఇతర రికార్డులను పరిశీలించారు. డిక్యుమెంట్ లేని వాటికీ జరిమానా వేయడం జరిగింది, అలాగే గ్రామంలో గుడుంబా వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గుడుంబా సేవించడం వల్ల ఆరోగ్య సమస్యలు, కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, నేరాల పెరుగుదల మరియు సామాజిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వివరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని గ్రామస్తులను కోరారు. ప్రజల సహకారంతో గ్రామంలో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేస్తామని, ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

## మంచానికే పరిమితమైన యువకుని కి హరీష్ రావు దాతృత్వం...



సిద్దిపేట తండ్రి కూలీ పని తల్లి బీడీలు చేస్తు జీవనం సాగిస్తున్న కుటుంబానికి పెద్దన్న అయిన హరీష్ రావుప్రమాదవశాత్తు కాలు విరిగిన యువకునికి రూ.5 లక్షల తో కృత్రిమ కాలు అందించి కుటుంబానికి ఆర్థిక భరోసానిచ్చిన హరీష్ రావు.పెద్దకోడూరు గ్రామానికి చెందిన యువకుడు రంజిత్ కు కృత్రిమ కాలు ఇచ్చి మరో సారి మానవత్వం చాటుకున్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు.చిన్నకోడూరు మండలం పెద్ద కోడూరు గ్రామానికి చెందిన వరుకొలు మల్లేశం-సాలవ్వ దంపతుల కుమారుడు 20 ఏళ్ల యువకుడు రంజిత్ కు గత కొన్ని రోజుల క్రితం ప్రమాదవశాత్తు యాక్సిడెంట్ జరిగి కాలు విరిగింది. చేతికి వచ్చే కొడుకు మంచానికె పరిమితం అయ్యాడని తల్లి తండ్రులు, నేను ఇక నా ఫ్రెండ్స్ తో కలసి పోలేను నేను పై చదువు లు చదువుకోలేను నా కాలు అడ్డంకి అనే ఆవేదన లో రంజిత్ బాధపడుతు,తల్లి తండ్రుల ఆసరా అవుతాడు అనుకునే సమయం లో కాలు విరిగింది కృత్రిమ కాలు తప్పితే ఎలాంటి దారి లేదు అని కృత్రిమ కాలు పెట్టకుందాం అనే అలోచన సిద్దిపేట లో తెల్సిన డాక్టర్ ని కన్సల్ట్ అయ్యారు అక్కడ రూ.8లక్షలు అవుతాయి అని వారు చెప్పడం తో అన్ని డబ్బులు మా వద్ద లేవుతండ్రి కూలీ పని, తల్లి బీడీలు చేస్తు జీవనం సాగిస్తున్నారు అంత ఆర్థిక స్థోమత అంత లేదు అని ఆందోళన చెందారు. అ సమయం లో హరీష్ రావు కలవాలి మాకు సహాయం కావాలి అని స్థానిక సర్పంచ్ సామల సునీత మధు ని కలసి హరీష్ రావు దగ్గరికి వచ్చారు.జరిగిన ప్రమాదం గురించి చెపుతు కృత్రిమ కాలు తప్ప వేరే దారి లేదు అని హరీష్ రావు కి వివరించారు. కానీ అంత డబ్బులు మా వద్ద లేవని ఆర్థిక భారం అవుతుందని చెప్పారు. అందుకు హరీష్ రావు నేను ఉన్న మీకు ఆందోళన చెందకండి నేను అండగా ఉంటానని..ఎన్ని డబ్బులు కానీ కృత్రిమ కాలు ఇప్పించే బాధ్యత నాదే అని మాట ఇచ్చాడు అ యువకునికి భరోసా కలిపించాడు కుటుంబానికి ధైర్యాన్ని నింపారు.మాట ఇచ్చాడు ఇచ్చిన మాటకు కృత్రిమ కాలు ను అందజేశారు.రూ.5 లక్షల రూపాయల తో యుకునికి కృత్రిమ కాలు ఇప్పించిన హరీష్ రావు.ఈ సందర్బంగా హరీష్ రావు కి వారు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తల్లి తండ్రులు ధన్యవాదములు తెలిపారు.

# గోపవరం మండల పరిధిలోని ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



బద్వేలు బద్వేల్ పట్టణంలో భాగమైన గోపవరం మండలంలోని గోపవరం గ్రామ పొలం 1983/1, 1984/1 లోని 3.5 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఆర్డిఓ చంద్రమోహన్ ఆదేశాల మేరకు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు గోపవరం మండల తాసిల్దార్ జీవన్ తెలియజేశారు.. అలాగే గోపవరం గ్రామ పొలం 1848, 1852 సర్వే నెంబర్లలోని 80 సెంట్లు భూమి, అలాగే 1852 లోని మరో ఒకటిన్నర ఎకరా ప్రభుత్వ భూమిలో కూడా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామని తాసిల్దార్ పేర్కొన్నారు.

## విద్యా వ్యవస్థను, పరీక్షల విధానాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిన కేంద్ర ప్రభుత్వం

సికింద్రాబాద్.. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థను, పరీక్షల విధానాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని సికింద్రాబాద్ డిసిసి అధ్యక్షుడు దీపక్ జాన్ మండిపడ్డారు. ఇటీవల నీట్ పరీక్షకు సంబంధించిన పరీక్ష పత్రాలు లీకైన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ తీరును తప్పుపడుతూ వెంటనే కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం పరీక్షలు నిర్వహించడంలో పూర్తి విఫలమైందని తీవ్ర విమర్శలు చేశారు.నీట్ పరీక్ష రద్దవడంతో విద్యార్థులు తీవ్ర నిరాశకు లోనై ఆత్మహత్యలకు చేసుకున్నారని ప్రైవేటు కోచింగ్ సెంటర్లలో లక్షల రూపాయలు కట్టి నేర్చుకున్న విద్య పేపర్ లీకేజీతో పూర్తిగా నీరుగారిపోయిందని అన్నారు.. ఏ ఐ సి సి అగ్రనేత రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ తీరును ప్రజల్లో విద్యార్థులలో ఎండగడుతున్నట్టు వెల్లడించారు. దేశవ్యాప్తంగా లక్షలాదిమంది వైద్య విద్యార్థులు రాసి నీట్ పరీక్షకు సంబంధించి పరీక్ష పత్రాలు లీక్ అవడం కేంద్ర ప్రభుత్వ అసమర్థతకు తార్కానమని అన్నారు.

# పార్లమెంట్ క్యాంపు కార్యాలయం ప్రారంభం

### గిరిజన హక్కుల పరిరక్షణకు పార్లమెంట్‌లో నిరంతర పోరాటం

### బాక్సైట్, హైడ్రో ప్రాజెక్టుల సర్వేలను ఖండించిన ఎంపీ తనూజ రాణి

అరకులోయ, రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని లేకుండా చేయాలని ప్రతిపక్షాలు పగటి కలలు కంటున్నాయని, అయితే గతంలో కంటే వైసీపీ మరింత బలోపేతమై ప్రజల్లో ఆదరణ పొందుతోందని అరకు పార్లమెంట్ సభ్యురాలు గుమ్మ తనూజా రాణి అన్నారు. అరకు పార్లమెంట్ సభ్యురాలిగా ఎన్నికై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం అరకులోయలో పార్లమెంట్ క్యాంపు కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ,గతంలో అరకు ఎంపీలు పార్లమెంటు కేంద్రంలో అందుబాటులోఉండటం లేదనే తీవ్ర విమర్శలు ఉన్నాయని, వాటిని అధికమించేందుకు ఈ క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సందర్భంగా ఆమె అన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సూచనల మేరకు ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో పార్లమెంట్ ప్రధాన కేంద్రంలో అందరికీ అందుబాటులో ఉండే విధంగా క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇకపై ప్రతి వారంలో మూడు రోజుల పాటు ఈ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని, పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలు తమ సమస్యలను నేరుగా తెలియజేయవచ్చని చెప్పారు. గిరిజనుల హక్కులు, చట్టాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించిన ఎంపీ, అలాంటి దుష్టపన్నాగాలను ప్రజలతో కలిసి తిప్పికొడతామని హెచ్చరించారు. గిరిజన ప్రాంతాల్లో ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన జీవో నంబర్ 3 అమలు కోసం ఇప్పటికే తొమ్మిది సార్లు లోక్‌సభలో ప్రస్తావించానని, సంబంధిత కేంద్ర



మంత్రులతో పాటు రాష్ట్రపతిని కూడా కలిసి వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. అరకు ఏజెన్సీలో హైడ్రో ప్రాజెక్టులు, బాక్సైట్ తవ్వకాల పేరుతో జరుగుతున్న సర్వేలను తీవ్రంగా ఖండించిన ఆమె, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన 30 రోజుల్లోనే బాక్సైట్ తవ్వకాల రద్దుకు సంబంధించిన జీవో నంబర్ 97 తీసుకొచ్చారని గుర్తు చేశారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని గిరిజన ప్రాంతాల్లో నివాస హక్కుల కోసం సుమారు 1,800 మంది గిరిజనేతరులు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన కేసు అంశాన్ని కూడా పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని ఆమె వెల్లడించారు. గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవల మెరుగుదలకు గత రెండేళ్లలో 10 అంబులెన్సులను అందించినట్లు పేర్కొన్న ఎంపీ, ఇప్పటివరకు సుమారు రూ.20 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. అనంతగిరి మండలంలోని తరచూ ప్రమాదాలు జరిగే తారాబు జలపాతం అభివృద్ధికి ఎమ్మెల్సీ నిధుల నుంచి రూ.5 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. మంచినీటి సమస్యల పరిష్కారానికి అరకు, పాడేరు నియోజకవర్గాల పరిధిలోని 36 పాఠశాలలకు ఆర్వో ప్లాంట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే గిరిజన హక్కుల పరిరక్షణలో కీలకమైన 1/70 చట్టం, పీసా చట్టం అమలు, ఇతర గిరిజన సమస్యలను రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించనున్నట్లు చెప్పారు. ఇటీవల కురుపాం, జి.కె.వీధి ప్రాంతాల్లో కలుషిత నీరు, ఆహారంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్న సమయంలో ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించిన ఆమె, విద్యార్థులుగిరిజన ప్రజలకు సంబంధించిన సమస్యలపై వైసీపీ ఎల్లప్పుడూ ముందుండి స్పందిస్తుందని పేర్కొన్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో పర్యాటకం, వైద్యం, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి పనిచేస్తున్నట్లు ఎంపీ తనూజా రాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ఎమ్మెల్సీ కుంభ రవిబాబు జిల్లా పరిషత్ చైర్మన్ జల్లిపల్లి సుభద్ర మాజీ ఎమ్మెల్యే లు పాల్గుణ భాగ్యలక్ష్మి హైమావతి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గిరిజన సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బొర్రా గుహల గిరిజన వ్యాపారుల షాపులను కొనసాగించాలి.

## ఎమ్మెల్సీ డా.కుంభా రవిబాబు డిమాండ్



అరకులోయ, అనంతగిరి మండలం బొర్రా గుహల పరిసర ప్రాంతంలో జీవనోపాధి కోసం చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహిస్తున్న 109 మంది గిరిజన వ్యాపారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్సీ డా.కుంభా రవిబాబు గారు అధికారులను కోరారు. బొర్రా వర్తక సంఘం సభ్యులు, గ్రామ పంచాయతీ పెద్దలు అరకులోయలోని ఎమ్మెల్సీ డా.కుంభా రవిబాబు గారిని ఆయన తోటలోని వారి క్యాంపు కార్యాలయం వద్ద కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలను వివరించారు. బొర్రా గుహల అభివృద్ధి కోసం పర్యాటక శాఖ రూ.30 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రస్తుతం ఉన్న 109 షాపులను తొలగించి కేవలం 38 షాపులకు మాత్రమే డీపీఆర్‌లో స్థానం కల్పించడం వల్ల స్థానిక గిరిజన కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయని తెలిపారు. దశాబ్దాలుగా చిన్న వ్యాపారాల ద్వారా జీవనం సాగిస్తున్న తమకు షాపులు తొలగిస్తే ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని వాపోయారు. గిరిజనుల జీవనోపాధికి భంగం కలగకుండా గత డీపీఆర్‌ను సవరించి ప్రస్తుతం ఉన్న 109 మంది వ్యాపారులకు తగిన విధంగా షాపులు నిర్మించి ఇవ్వాలని పలుమార్లు అధికారులను కోరినా స్పందన లేదని వ్యాపారులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలను ఓపికగా విన్న ఎమ్మెల్సీ డా.కుంభా రవిబాబు గారు మాట్లాడుతూ, స్థానిక గిరిజనుల హక్కులు మరియు జీవనోపాధికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గిరిజనులను నిర్లక్ష్యం చేయడం తగదని, వారి సమస్యలను పరిష్కరించే దిశగా జిల్లా యంత్రాంగం వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో పాటు డీవీఎం (ఆఎఓ) గారికి ఫోన్ ద్వారా విషయం తెలియజేసి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. గిరిజన వ్యాపారుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే బొర్రా గుహల ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాగే బొర్రా గుహల ప్రవేశ రుసుము, జిప్‌లైన్ ఆదాయంలో గ్రామ పంచాయతీకి రావలసిన వాటాను చెల్లించాలని, గ్రామ పంచాయతీకి సంబంధించిన పెండింగ్ నిధులను విడుదల చేయాలని, మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణలో స్థానిక గ్రామ పంచాయతీకి ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పాంగి చిన్నారావు, బొర్రా మాజీ సర్పంచ్ జన్ని అప్పారావు, నాయకులు సుభాష్ చంద్ర, గుడివాడ ప్రకాశ్ రావు, వంతాల గురు నాయుడు, నానిబాబుతో పాటు బొర్రా వర్తక సంఘం సభ్యులు, గ్రామ పంచాయితీ పెద్దలు, స్థానిక నాయకులు, పంచాయితీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ పేరిట మోసాలు ముగ్గురు అరెస్టు

మల్కాజ్ గిరి సికింద్రాబాద్.. అల్వాల్ పీఎస్ పరిధిలో రెండు పడక గదుల ఇళ్లను ఇప్పిస్తామంటూ ప్రజలను మోసం చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసారు. పుష్పలత, విశాల్, మహేందర్ సింగ్ లను అరెస్టు చేశాం. మరో నలుగురి కోసం గాలిస్తున్నామని డీసీపీ శ్రీధర్ వెల్లడించారు. అల్వాల్ లో ఉండే జయరాజ్ ప్రభుత్వ కార్యాలయాలలో పైరవీలు చేస్తూ ఉంటాడు. పుష్పలత గతంలో జి.హెచ్.ఎం.సి లో విధులు నిర్వహించేవారు. జయరాజ్,పుష్పలత కలిసి ప్రజలకు రెండు పడక గదుల ఇళ్ళు ఇస్తామని నమ్మించారు. అదే అదునుగా తీసుకుని అల్వాల్ పరిధిలో పరిచయమున్న వ్యక్తులకు లక్ష రూపాయలకే ఇళ్లు ఇస్తామని నమ్మించారు. దాదాపు 2023 నుండి 99 మంది బాధితులు పోలీసులను ఆశ్రయించారని అయన అన్నారు. పలు దఫాలుగా వీరి నుండి డబ్బులు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సంప్రదించగా వీరికి రెండు పడక గదుల ఇళ్ళు కేటాయించలేదని తేలడంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

# గడువులోగా పెండింగ్ పనులు పూర్తి చేయండి:

# అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



కరీంనగర్ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లావ్యాప్తంగా మంజూరైన అభివృద్ధి పనులు సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీవో భవనాలు, ప్రహరీ, కిచెన్ షెడ్లు వేగవంతం చేసి వెంటనే ఈనెల 30 లోగా పూర్తిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే.. అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఈజీఎస్ పెండింగ్ పనులపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ. ఈజీఎస్ కింద మంజూరైన పనులు సత్వరం పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతూ గడువు తేదీలోగా నిర్దేశించిన లక్ష్యం చేరుకోవాలన్నారు. మంజూరైన పనులు ఆపకుండా తక్షణం గ్రౌండింగ్ చేసి ప్రారంభించాలన్నారు. ఈ సందర్భంగా మండలాల వారీగా జరుగుతున్న పనుల వివరాలు ఏఈలని అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలోమస్టర్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీఆర్డిఓ గీత, పంచాయతీరాజ్ ఈఈ జనార్ధన్, అదనపు డీఆర్డీఓలు, జిల్లాలోని ఆరు సబ్ డివిజన్ల పంచాయతీరాజ్ డీఈలు, 15 మండలాల ఏఈలు పాల్గొన్నారు.

# యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి:

# పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం.




కరీంనగర్ అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని నేడు పురస్కరించుకుని, తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'యాంటీ డ్రగ్ అవేర్నెస్ వీక్' కార్యక్రమాలు కరీంనగర్ జిల్లాలో ఉత్సాహంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం నాల్గవ రోజు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు ఇతర ప్రభుత్వ విభాగాల సమన్వయంతో నగరంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు.?కలెక్టరేట్ ప్రారంభమైన ఈ 2 కిలోమీటర్ల ర్యాలీ గీతాభవన్ చౌరస్తా మీదుగా పోలీస్ పరేడ్ గ్రౌండ్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో వివిధ విద్యాసంస్థల విద్యార్థులు, నర్సింగ్, మెడికల్ కాలేజీల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గీతాభవన్ చౌరస్తాలో నర్సింగ్ కళాశాల విద్యార్థినులు ప్రదర్శించిన వీధి నాటకం నాటిక, అవగాహన గీతాలు ప్రజలను, తోటి విద్యార్థులను ఎంతగానో ఆలోచింపజేశాయి.?అంధకారంలోకి భవిష్యత్తు స్కిట్ ద్వారా కళ్ళకు కట్టినట్లు ప్రదర్శన..ర్యాలీ అనంతరం కమిషనరేట్ కేంద్రంలోని అస్త్ర కన్వెన్షన్ హాలు నందు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అధ్యక్షతన విద్యార్థులతో భారీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఈగల్ ఫోర్స్ విడుదల చేసిన పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రత్యేక షార్ట్ ఫిల్మ్‌ను విద్యార్థులకు ప్రదర్శించారు. అనంతరం చల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన స్కిట్ డ్రగ్స్ మహమ్మారి వల్ల యువత జీవితాలు ఎలా అంధకారంలోకి వెళ్తాయి, కుటుంబాలు ఎలా నాశనమవుతాయనే విషయాన్ని కళ్ళకు కట్టింది. నర్సింగ్ విద్యార్థినులు తమ నృత్య ప్రదర్శన ద్వారా డ్రగ్స్ రహిత సమాజంపై చక్కని సందేశాన్ని ఇచ్చారు.?ఈ సదస్సులో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి సరస్వతి, డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పర్వీన్, ఏసీపీలు వేణుగోపాల్, విజయకుమార్, యాదగిరిస్వామి,ఆంటీ నార్కోటిక్ ఇన్స్పెక్టర్ రఫీక్ ఖాన్ ఇతర పోలీస్, ఎక్సైజ్ అధికారులు మరియు వివిధ విద్యాసంస్థల ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## గుంటుపల్లి ఎత్తిపోతల పథకం నుంచి సాగునీటి విడుదల

## నారుమళ్ల అవసరాలకు సాగునీరు అందుబాటులోకి

ఎన్టీఆర్ జిల్లా, ఇబ్రహీంపట్నం, ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి ఎత్తిపోతల పథకం నుంచి సాగునీటిని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు గారు గురువారం విడుదల చేశారు. రైతుల సాగు అవసరాలను దృష్టిలో ఉంచుకుని నారుమళ్లకు అవసరమైన నీటిని అందించేందుకు ఈ చర్య చేపట్టినట్లు తెలిపారు. గుంటుపల్లి ఎత్తిపోతల పథకం పరిధిలోని సుమారు రెండు వేల ఎకరాల ఆయకట్టుకు ఈ నీటి విడుదలతో ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం వరి సాగు ప్రారంభ దశలో ఉండటంతో నారుమళ్ల పెంపకానికి నీటి కొరత లేకుండా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గారు సూచించారు. రైతులు సకాలంలో సాగు పనులు చేపట్టేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. వ్యవసాయ ఉత్పాదకత పెరగడంతో పాటు రైతుల ఆదాయం మెరుగుపడేలా సాగునీటి వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. నీటి వినియోగంలో రైతులు సమన్వయంతో వ్యవహరించి ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, నీటిపారుదల శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు

# వెల్లటూరులో కృష్ణా జిల్లా సహకార కేంద్ర

# బ్యాంకు నూతన శాఖ ప్రారంభం.

### ప్రారంభించిన మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు, కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం.

ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం వెల్లటూరు గ్రామంలో కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (కేడీసీసీబీ) నూతన శాఖను గురువారం ఘనంగా ప్రారంభించారు. మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు , కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం సంయుక్తంగా రిబ్బన్ కట్ చేసి శాఖను ప్రారంభించారు. రైతులకు, మహిళలకు చేరువలో బ్యాంకింగ్ సేవలు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, "సహకార రంగాన్ని బలోపేతం చేయడం, రైతులు, డ్వాక్రా మహిళలు, చిరు వ్యాపారులకు బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. వెల్లటూరు, చుట్టుపక్కల గ్రామాల ప్రజల చిరకాల కోరిక నేడు నెరవేరింది. ఈ నూతన శాఖ ద్వారా రైతులకు సకాలంలో పంట రుణాలు, స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సహకారం వేగంగా అందుతుంది" అని పేర్కొన్నారు. జిల్లాలో విస్తరిస్తున్న సహకార బ్యాంకింగ్. కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం మాట్లాడుతూ, "రైతు సంక్షేమమే ధ్యేయంగా కేడీసీసీబీ పనిచేస్తోంది. వెల్లటూరు బ్రాంచి ఏర్పాటుతో ఈ ప్రాంత రైతులకు, మహిళా సంఘాలకు మరింత సౌలభ్యం కలుగుతుంది. డిపాజిట్ల సేకరణ, రుణాల మంజూరు, రికవరీలో మన బ్యాంకు రాష్ట్రంలోనే ముందంజలో ఉంది" అని తెలిపారు. అందుబాటులో సేవలు. నూతన శాఖ ద్వారా పంట రుణాలు, డ్వాక్రా రుణాలు, బంగారు రుణాలు, వ్యవసాయ అనుబంధ రుణాలు, డిపాజిట్ పథకాలు, ఇతర బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉంటాయని బ్యాంకు అధికారులు వెల్లడించారు. రైతులు పాస్‌బుక్, ఆధార్ కార్డులతో నేరుగా లావాదేవీలు నిర్వహించుకోవచ్చు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల 31 డిమాండ్లపై చర్చలు

## సమస్యలు పరిష్కారం కాకపోతే సమ్మె అనివార్యం - ఎఐటియుసి హెచ్చరిక



**పెద్దపల్లి/గోదావరిఖని, జూన్ 25, ప్రజాబలం ప్రతినిధి:** సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలు, పెండింగ్ డిమాండ్లు, ఉద్యోగ భద్రత, సంక్షేమ అంశాల పరిష్కారం కోసం గుర్తింపు సంఘం ఎఐటీయూసీ ఈ నెల 8వ తేదీన యాజమాన్యానికి సమ్మె నోటీసు అందజేసిన విషయం తెలిసిందే.

కార్మికుల న్యాయమైన 31 డిమాండ్లపై స్పందించిన రీజినల్ లేబర్ కమిషనర్, హైదరాబాద్‌లో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ డా" శాశ్వతి రథ్ సమక్షంలో గురువారం సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఉదయం ప్రారంభమైన ఈ చర్చల్లో కార్మికుల సమస్యలు, యాజమాన్య వైఖరి, పెండింగ్ అంశాలు, అమలు కాని ఒప్పందాలు, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. కార్మికుల తరపున ఎఐటీయూసీ నాయకులు సమస్యల తీవ్రతను, వాటి ప్రభావాన్ని వివరంగా వివరించారు. యాజమాన్యం తన అభిప్రాయాలను వెల్లడించింది. ఇరుపక్షాల వాదనలు విన్న అసిస్టెంట్ లేబర్ కమిషనర్ డా. శాశ్వతి రథ్ గారు, యాజమాన్యం మరియు గుర్తింపు సంఘం పరస్పర చర్చల ద్వారా కార్మికుల ప్రధాన డిమాండ్లపై సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. జూలై 10వ తేదీలోపు సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నించాలని, పరిష్కారం కాని పక్షంలో మళ్లీ చర్చలకు పిలుస్తామని తెలిపారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి యాజమాన్యం స్పష్టమైన హామీ ఇవ్వకపోతే సమ్మె తప్పదని ఎఐటీయూసీ నాయకులు స్పష్టం చేశారు. కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే మరింత ఉధృతమైన పోరాటాలకు సిద్ధమవుతామని వారు ప్రకటించారు. చర్చల్లో పాల్గొన్న వారిలో ఎఐటీయూసీ తరపున అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య, ఉప ప్రధాన కార్యదర్శి కే. సారయ్య పాల్గొన్నారు. యాజమాన్యం తరపున ఏజీఎం పర్సనల్ అజయ్ కుమార్ హాజరయ్యారు. కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారమే లక్ష్యమని గుర్తింపు సంఘం స్పష్టం చేసింది.

# బీసీల సమస్యలకు పరిష్కారం చూపాలి..

# బేరి రామచందర్ యాదవ్

### బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు కి వినతి పత్రం అందించిన బీసీ కుల సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్



బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు కి వినతి పత్రం అందించిన బీసీ కుల సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్

హైదరాబాద్.. తెలంగాణలోని బీసీ కులాల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ పేర్కొన్నారు. బీసీల డిమాండ్ల కోసం బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు కి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కంటెస్టింగ్ అభ్యర్థి మారబోయిన రవి కుమార్ యాదవ్ గారికి ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఆనంద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్ సమక్షంలో ఓబీసీ సమస్యల గురించి వినతి పత్రం సమర్పించిన బీసీ కుల సంఘాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్, బీసీ నాయకులు. బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రగుండ్ల ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో మియాపూర్ ఓబీసీ మోర్చా సమావేశం మదినగూడ భూమి బ్యాంకెట్ హాల్లో నిర్వహించారు. ప్రభాకర్ యాదవ్ ఆహ్వానం మేరకు బీసీ కుల సంఘాల అధ్యక్ష కార్యదర్శులు బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్, బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్ లు బిసి సంక్షేమ పథకాలు, సమస్యల గురించి బిజెపి అధ్యక్షులు రామచంద్ర రావు గారికి అందరు కలిసి మెమొరాండం సమర్పించడం జరిగింది. ముఖ్యంగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉన్నందున 54 శాతం ఉన్న బీసీలకు న్యాయం చేయాలని పేద వర్గాలైన 132 బీసీ కులాలకు అన్ని విధాల సహాయ పడాలని విన్నవిస్తూ మెమొరాండం సమర్పించడం జరిగింది. బీసీ కులాల్లో ఎక్కువగా పేదలు ఉన్నందున విద్యా, వైద్యంలాంటి అధిక ఖర్చులు భరించలేని పక్షంలో ఉన్న పేదలకు కేంద్ర ప్రభుత్వం కూడా బాధ్యత తీసుకొని విద్య కోసం ఎక్కువ బడ్జెట్ కేటాయించి కార్పొరేట్ హాస్పిటల్స్ లో పేదలు లక్షలు బిల్లు చెల్లించలేరని అన్ని ఆలోచనతో పేదలను ఆదుకోవాలని కోరడం జరిగింది. పేదలు బ్రతకడానికి ముద్ర లోన్లు సబ్సిడీ లోన్స్ మిగతా అన్ని సంక్షేమ పథకాలను తూచా తప్పకుండా అన్ని బీసీ కుల సంఘాలకు వర్తించే విధంగా వృత్తి ధర్మంగా 132 కులాలకు సహాయం చేయాలని ప్రత్యేకించి విన్నవించడం జరిగింది. బీసీ ముఖ్యమంత్రి బిజెపి డిక్లేర్ చేసిన సంక్షేమ పథకాలు ద్వారా ప్రజల్లోకి వెళ్లి అత్యధిక జనాభా కలిగిన బీసీలకు జీవన భృతి కలిగే విధంగా సహాయపడాలని ఉద్యోగాలు ప్రభుత్వం మొత్తం కల్పించకపోయినా .....ఉపాధి మరియు స్వంత వ్యాపారాలు చేసుకోవడానికి బీసీలకు లోన్స్ తో ఆదుకోవాలని ముఖ్యంగా రైతుల్లో 50 శాతం కంటే ఎక్కువ ఉన్న బీసీలు చాలామంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. బ్యాంకు లోన్ ఇవ్వనందున ఎంతో మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు, రైతులకు సబ్సిడీ ఎరువులు సబ్సిడీ విత్తనాలు అవన్నీ కూడా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రైతులకు సహాయపడాలని విన్నవించడం జరిగింది. స్వాతంత్రం వచ్చి సుదీర్ఘకాలం తరువాత కూడా ఆర్థిక అంతరాలు పెరిగిపోయినవి. ధనవంతులు కుబేరు లైతే పేదలు నిరుపేదలై కొట్టుమిట్టాడుతున్నారు. గ్రామీణ వలసలు పట్టణాలకు పెరిగిపోయినవి అందుకని ఆర్థిక సామాజిక న్యాయం పేదలకు ముఖ్యంగా బీసీలకు జరగాలని కోరడం జరిగింది పేదరిక నిర్మూలన వాజ్పేయి ఇందిరా గాంధీ పిలుపుఇచ్చిన పేదరికం పోలేదు. ప్రజాస్వామ్యంలో చేతినిండా పని కడుపునిండా అన్నం ఉండాల్సిందే. గ్రామీణ ప్రాంతాల్లో రోజుగార్ యోజన గ్రామీణ సడక్ యోజన ఎన్ని యోజనాలు ఉన్నా కూడా పేదరికానికి తొలగించే.. విధంగా ప్రభుత్వాలు ఇంతవరకు ప్రయత్నం చేయలేదు సంక్షేమ ఫలాలు 132 కులాలకు సంచారజాతులైన కొన్ని బీసీ కులాలు అసలు వారు ఎక్కడున్నారో తెలియని పరిస్థితి వాళ్లను కూడా గుర్తించి సహాయపడాలని బీసీ కులాల బిసి సంఘాల ప్రధాన కార్యదర్శులు అధ్యక్షులు, బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్ బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ విజ్ఞప్తితో వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బేరి రామచంద్ర యాదవ్ తో పాటు ఆర్కే సాయన్న ముదిరాజ్ మేదరి సంఘం అధ్యక్షులు కొంటు ముకుందం బట్రాజు సంఘం అధ్యక్షులు రాజు విశ్వబ్రాహ్మణ సంఘం శేరిలింగంపల్లి శ్రీశైలం కురుమ,సాయి లు విశ్వకర్మ సంఘం హరికృష్ణ చారి ఐక్యవేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి కోటగిరి మారుతి అధ్యక్షులు కృష్ణమోహన్ యువత అధ్యక్షులు కొంటూ సుమన్ ఆంజనేయులు గౌడ సంఘం రామకృష్ణ గౌడ్ మున్నూరు కాపు సంఘం బి కృష్ణ నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సాయిలు, ముత్యం ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, భారీ ఎత్తున బీసీ కుల సంఘాల నాయకులు అధ్యక్ష కార్యదర్శులు అందరూ కలిసి సంక్షేమ ఫలాలతో బీసీలను ఆదుకోవాలని విన్నవించారు.

## వీబీఆర్ కళాశాలలో ఘనంగా పోలీసుల అవగాహనా సదస్సు?

జూన్ 25 రేణిగుంట :యువత సన్మార్గంలో నడిచి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలనే సదుద్దేశంతో, గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని వీబీఆర్ కళాశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం ఒక భారీ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 'ఈగల్' ఇన్‌స్పెక్టర్, గాజుల మన్యం సిఐ మంజునాథ్ ఎస్సై హరీష మరియు వారి పోలీసు బృందం పాల్గొని విద్యార్థులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈగల్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ?మాదకద్రవ్యాల నివారణ యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని క్షణికావేశంలో వ్యసనాలకు బానిసలైతే జీవితాలు మరియు కెరీర్ నాశనమవుతాయని హెచ్చరించారు. కళాశాల పరిసరాల్లో ఎవరైనా మాదకద్రవ్యాలు విక్రయించినా, వినియోగించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# పంచలింగాల్ ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సన కొండల్ రెడ్డి



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 25 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పంచలింగల్ ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న వికారాబాద్ ఎమ్మెల్యే తెలంగాణ శాసనసభాపతి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ,మరియు మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సనగారి కొండలరెడ్డి, పేదింటికల ఇందిరమ్మ రాజ్యంలో అందమైన గృహాన్ని నిర్మించుకొని కుటుంబమంతా ఎంతో సంతోషంగా జరుపుకుంటున్న పండుగ నూతనగృహప్రవేశమని తెలిపారు ఇలా ఎన్నో సంవత్సరాలుగా ఒకే ఇంట్లో అన్న తమ్ములు ఉమ్మడి కుటుంబం ఉన్నవారు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటూ కాలాన్ని ఎళ్ళదీశారు ఈనాడు ఇందిరమ్మ రాజ్యంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు ఇవ్వడం అందమైన ఇల్లు నిర్మించుకోవడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తపరిచినట్టు తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ప్రజల ప్రభుత్వం ప్రజా క్షేమం కోరే ప్రభుత్వం ప్రజల పార్టీ అని తెలిపారు గృహప్రవేశ కార్యక్రమంలో వికారాబాద్ శాసనసభ్యులు తెలంగాణ శాసనసభాపతి స్పీకర్ గ డ్డం ప్రసాద్ కుమార్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సనగారి కొండల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ కుమార్ యాదవ్, సీనియర్ నాయకులు పెద్దలు సుభాష్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మనీలా సురేష్ కుమార్, ప ట్లూరు మాజీ ఎంపిటిసి మో రంగపల్లి సురేష్, మరియు మండల నాయకులు సీనియర్ నాయకులు పెద్దలు కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు యువకులు పెద్ద కుటుంబ సభ్యులు బంధుమిత్రులుఎత్తున గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నట్టు తెలిపారు



# ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్న మంత్రి సీతక్క



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జూన్ 25**గురువారం ఏటూరు నాగారం మండల కేంద్రంలోని ఆకులవారి ఘనపూర్ ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి సందర్శించారు.

ఈ సందర్భంగా మంత్రి దనసరి అనసూయ సీతక్క వసతి గృహంలోని మరుగుదొడ్లు, వంటశాల, తరగతి గదులు, విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు నాణ్యంగా ఉండేలా చూడాలని, ప్రభుత్వ వసతి గృహాలలో పరిశుభ్రత, భోజన నాణ్యత, మరుగుదొడ్లు, తరగతి గదులు వంటి మౌలిక సదుపాయాల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అనంతరం మంత్రి సీతక్క విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకుని, వారితో కలిసి అల్పాహారం చేసి అందిస్తున్న ఆహారం నాణ్యతను పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి,
గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు పిరంగి,జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మంగపేటలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జూన్ 25**గురువారం మంగపేట మండల కేంద్రంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఆఫీస్ భవనాల నిధుల కింద రూ.150 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న మండల ప్రజా పరిషత్ భవన నిర్మాణ పనులకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలిసి శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పిఓ లెనిన్ వత్సల్ టోప్పో, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారు, తదితరులు పాల్గొన్నారు

# నెక్కంపూర్ లో మున్సిపల్ అధికారుల పర్యటన.



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజా బలం ప్రతినిధి 25 జూన్ 2026**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ అధికారులు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రోజుకొక్క వార్డు పర్యటనలో భాగంగా స్థానిక సమస్యల పరిష్కారానికి గాను 45 నార్సింగి సర్కిల్ మున్సిపల్ పరిధిలోని 128 నెక్కంపూర్ డివిజన్ లోని రాణి రుద్రమదేవి పార్కునకు సైబరాబాద్ కమిషనర్ శ్రీజన గుమ్మళ్ల, జోనల్ కమిషనర్ నారాయణ అమిత్, స్థానిక డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి తదితరులు రావడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక నాయకులు లేవనెత్తిన అంశాలలో ముక్యంగా రోడ్డు మరమ్మతులు, వీధి దీపాలతో పాటు రోడ్డు ఆక్రమణలను తొలగించి అట్టి సమస్యను గాలికి వదలడం జరిగినదని పిర్యాదు చేయడం జరిగింది. ట్రాఫిక్ సమస్య అతి కీలకమనీ అందుకు పరిష్కారం దృష్టా వైన్ షాప్ లను తొలగించాలని, ప్రజల ఉపయోగార్థం అంబేద్కర్ భవన నిర్మాణం పూర్తి చేయాలని, పూర్వ కాలం నుండి ఉన్న పుపాలగూడ శ్మశాన వాటికకు దారి తిరిగి ఏర్పాటు చేయాలని కోరడం జరిగింది. బుళకాపుర నాలా స్థలం కబ్జాకు గురి అయినవని ఒక వేళ వాటిని ఇలాగే కొనసాగితే రాబోయే వర్షా కాలంలో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురైతావని, అలకపూర్ హై టెన్షన్ వైర్ రోడ్డు బి ఆర్ సి వెళ్లే ముందు వినాయక నగర్ లో రోడ్డు కుంచిశీచింకు పోయిందని సంబంధిత విషయం పరిష్కరిస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ఇక్కడ అసలు అవసరం లేని రోడ్డులు ఎవరి గురించి త్రవ్వుతున్నారో కాని మొత్తానికి ప్రజా ధనం వృథా చేస్తు అంజలి గార్డెన్ రహదారి త్రవ్వడం, డ్రైనేజీ పైప్ లు వేయడం పలు అనుమానాలకు తావిస్తోంది మరియు అట్టి రహదారి ఇప్పటికే పలు మార్లు దెబ్బతిన్నదని కలత చెందుతున్నారు, అదే మాదిరి ప్రస్తుతం అవసరం లేని వర్షపు నీటి పారుదల పేరుతో అలకపూర్ రోడ్డు 30 లో తవ్వకాలు చేపట్టడం, అందుకు పూర్తి కాలనీ వాసులు ఆవేదనతో వాపోతూ అధికారుల చేష్టలు హాస్య స్పందనంగా ఉన్నవని తెలిపారు. పైన తెలిపిన అన్ని సమస్యలను వీలైనంత తొందరలో పరిష్కారిస్తామని అధికారులు హామీ ఇవ్వడం జరిగింది.

# ఆందోల్--జోగిపేట మున్సిపల్ కి ఘన స్వాగత ద్వారం అభివృద్ధికి నూతన చిరునామా




**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 26 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా** :తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనరసింహ, ప్రత్యేక చొరవతో, ఆందోల్--జోగిపేట మున్సిపల్ పరిధి ప్రారంభంలో జాతీయ రహదారి ఎన్,హెచ్,161, నుండి మున్సిపాలిటీలోకి వచ్చే ప్రతి ప్రయాణికుడికి ఘన స్వాగతం పలికేలా, అలాగే మున్సిపాలిటీ నుండి ఎన్.హెచ్,161, వైపు వెళ్లే ప్రయాణికులకు “ధన్యవాదాలు మళ్లీ రండి” అనే సందేశాన్ని అందించేలా, రూ.2 కోట్ల వ్యయంతో అత్యాధునిక హంగులతో వెల్కమ్ అర్చ్ నిర్మాణం చేపట్టడం జరుగుతోంది.రూ.2 కోట్లతో ప్రతిష్టాత్మక వెల్కమ్ అర్చ్ నిర్మాణం ఎన్,హెచ్,161పై ఆందోల్--జోగిపేటకు, సరికొత్త గుర్తింపు పట్టణ సౌందర్యాన్ని మరింత పెంచే ఆధునిక డిజైన్ అభివృద్ధి, ఆతిథ్యం, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే నిర్మాణం,
మంత్రి దామోదర్ రాజనరసింహ, అభివృద్ధి.దూరదృష్టికి మరోనిదర్శనం
ప్రతి హామీకి కార్యరూపశీ ప్రతి అభివృద్ధి వెనుక మంత్రి దామోదర్ రాజనరసింహ కృషి

## ఆందోల్ నియోజకవర్గంలో పలు వివాహ వేడుకలకు హాజరైన మంత్రి దామోదర్ రాజనరసింహ

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 25 ( ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా,:**ఆందోల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జరిగిన వివాహ వేడుకలకు హాజరైన తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనరసింహ, నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి దాంపత్య జీవితం ఆనందం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో నిండాలని ఆకాంక్షించారు. అలాగే వివాహ వేడుకలకు,విచ్చేసిన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానిక ప్రజలను, మంత్రి ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు





# ఇందిరమ్మ చీరల పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు బద్దంసతీష్‌గౌడ్



**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:**గురువారంనాడు తేదీ 25జూన్ 2026 గోషామహల్ నియోజకవర్గం బేగంబజార్ డివిజన్ ఈసమియా బజార్ కమ్యూనిటీ హాల్ వద్ద స్వయం సహకార గ్రూప్ సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టిన బద్దం సతీష్ గౌడ్ ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కన్వీనర్ గోషామహల్ నియోజకవర్గం డెవలప్మెంట్ ఫోరమ్, రేణుక, స్వప్న, అనూష పర్యవేక్షణ లో కార్యక్రమం నిర్వహించడం జరిగింది

# రాజ్యాంగం కల్పించిన వజ్రాయుధం ఓటు హక్కు...

### ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలి

### 2కె రన్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 25(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి/ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు ఎంత ముఖ్యమో, యువత భవిష్యత్తుకు మాదకద్రవ్యాల రహిత సమాజం అంతే అవసరమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు,ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితాల సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్-2026)పై ఓటర్లలో అవగాహన కల్పించడంతో పాటు మాదకద్రవ్యాలను నిర్మూలించాలన్న సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జిల్లా కలెక్టరేట్ నుంచి ఐబీ






గెస్ట్ హౌస్ వరకు గురువారం నిర్వహించిన 2కె రన్‌ను వారు జెండా ఊపి ప్రారంభించారు,ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు నమోదు చేసుకోవడం ప్రజాస్వామ్య బాధ్యత అని పేర్కొన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ద్వారా ఓటరు జాబితాలను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందిస్తున్నామని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువకుడు, యువతి ఓటరుగా నమోదు కావాలని, చిరునామా మార్పులు, పేరు సవరణలు, ఇతర వివరాల నవీకరణ కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు,రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడంలో ఖచ్చితమైన ఓటరు జాబితా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. నేటి నుంచి బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌వోలు)ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారని, ప్రజలు సరైన వివరాలను అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు,అలాగే మాదకద్రవ్యాల దుర్వినియోగం సమాజానికి, ముఖ్యంగా యువతకు తీవ్రమైన ముప్పుగా మారుతోందని పేర్కొంటూ, డ్రగ్స్‌కు దూరంగా ఉండటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రీడలు, విద్య, సృజనాత్మక కార్యకలాపాల ద్వారా యువత తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు,జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణాను అరికట్టడంలో పోలీసు శాఖకు ప్రజల సహకారం ఎంతో అవసరమని అన్నారు. మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు,యువత చెడు అలవాట్ల బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్‌కు ‘నో’ చెప్పి ఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని “మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేస్తామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు.”ఈ 2కె రన్‌లో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు కలెక్టర్ పాండు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత, సాంస్కృతిక సారథి కళాకారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు,

# విద్యార్థుల సైన్స్ ల్యాబ్ ను ప్రారంభించిన మంత్రి సీతక్క



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జూన్ 25**గురువారం ములుగు జిల్లా మంగపేట మండలం రాజుపేట గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నూతనంగా నిర్మించిన భవనం సైన్స్ ల్యాబ్ ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా,శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో ప్రారంభించారు.
ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, ఏటూరు నాగారం ఏ ఎస్ పి మనన్ భట్, గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, డి ఈ ఓ సిద్ధార్థ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల వద్దకే సుపరిపాలన... సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజా దర్బార్.

## అర్హులైన ప్రతి పేద కుటుంబానికి పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు.

## మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జూన్ 25 మంగపేట**గురువారం ములుగు జిల్లా మంగపేట మండలం రాజుపేట గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో మంగపేట మండల పరిధిలోని అక్కినేపల్లి మల్లారం, బ్రాహ్మణపల్లి, రాజుపేట, కత్తిగూడెం, నిమ్మగూడెం, దోమెడ, రామచంద్రునిపేట, వాడేగూడెం, రమణక్కపేట, చుంచుపల్లి, వాగుడుగూడెం గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రజలు తమ సమస్యలు, వినతిపత్రాలను అందజేశారు.



ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల ఆర్థిక బలోపేతానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇప్పటివరకు మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల రూపంలో రూ.61 వేల కోట్లకు పైగా సహాయం అందించామని తెలిపారు. గతంలో మహిళా సంఘాలకు రూ.5 లక్షల వరకు మాత్రమే అందిన వడ్డీలేని రుణ పరిమితిని ప్రస్తుతం రూ.10 లక్షలకు పెంచామని పేర్కొన్నారు.

మహిళా సంఘాల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతోందని, పాడి కేంద్రాలు, కొనుగోలు కేంద్రాల నిర్వహణలో మహిళా సంఘాలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు. గ్రామీణ మహిళలు సంఘాలుగా ఏర్పడి కలిసి పనిచేస్తే కుటుంబాల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

ప్రజలు జిల్లా కేంద్రాలకు తిరగాల్సిన అవసరం లేకుండా గ్రామాల వద్దకే పరిపాలనను తీసుకువెళ్లడం ప్రత్యేక ప్రజా దర్బార్ లక్ష్యమని మంత్రి తెలిపారు. ప్రజలు అందించే ప్రతి దరఖాస్తును పరిశీలించి, వాటి సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి నిర్ణీత వ్యవధిలో పరిష్కరించే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని, ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ప్రాధాన్యత క్రమంలో ఇండ్లను అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ ప్రజలకు సులభంగా దరఖాస్తులు అందించే విధంగా ప్రత్యేక ఫార్మాట్ రూపొందించామని తెలిపారు. గ్రామాల వారీగా అందుతున్న దరఖాస్తుల ద్వారా స్థానిక సమస్యలపై స్పష్టమైన అవగాహన ఏర్పడి, పరిష్కార చర్యలు మరింత వేగవంతం అవుతాయని తెలిపారు.

ప్రతి దరఖాస్తును నమోదు చేసి సంబంధిత శాఖలకు పంపించి, పరిష్కార స్థితిపై నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తామని, సమస్య పరిష్కారం కాకపోతే కారణాలను కూడా ప్రజలకు స్పష్టంగా తెలియజేసే విధంగా వ్యవస్థను రూపొందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

అంతకుముందు మంగపేట మండల కేంద్రంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఆఫీస్ భవనాల నిధుల కింద రూ.150 లక్షల వ్యయంతో నిర్మించనున్న మండల ప్రజా పరిషత్ భవన నిర్మాణ పనులకు మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి శంకుస్థాపన చేశారు.

అనంతరం రాజుపేట గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నూతనంగా నిర్మించిన సైన్స్ ల్యాబ్ భవనాన్ని మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, ఏటూరు నాగారం ఏ ఎస్ పి మనన్ భట్, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి., సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, పంచాయతీ రాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, తహసీల్దార్, ఎంపీడీవో, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలందరూ సర్( ఎస్ ఐ ఆర్ )లో తప్పక పాల్గొనాలి...

# ఏద్దుమైలారం లో సర్ ప్రక్రియను పరిశీలించిన నిర్మల జగ్గారెడ్డి



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 25(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/ప్రజలందరూ సర్ ప్రక్రియ లో తప్పనిసరిగా పాల్గొనాలని టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి పిలుపునిచ్చారు,గురువారం కంది మండలం ఏద్దుమైలారం గ్రామంలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ను పరిశీలించారు,ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ ఓటు హక్కు అత్యంత విలువైనదని, తమ ఓటును కాపాడుకోవడానికి ప్రతీ ఒక్కరూ సర్ ప్రకియలో పాల్గొనాలని అన్నారు,ఓటర్ల జాబితా సవరణ అనేది ఇదే తొలిసారి కాదని,స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇది ఎనిమిదోసారి జరుగుతున్న సవరణ అన్నారు,ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు,మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘు గౌడ్ ,కంది మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొగులయ్య,ఏద్ధ మైలారం సర్పంచ్ చంద్రయ్య, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి,నాయకులు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మర్పల్లి నూతన ఎమ్మార్వో ను మర్యాదపూర్వకంగా సన్మానించిన మాజీ జెడ్పిటిసి మధుకర్,బి ఆర్ ఎస్ నాయకులు



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 25 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం నూతన ఎమ్మార్వో గా బాధ్యతలు స్వీకరించిన మనోహర్ చక్రవర్తి ని మర్యాదపూర్వకంగా శాలువాతో సన్మానించిన మాజీ జెడ్పిటిసి మధుకర్, బి ఆర్ ఎస్ నాయకులు మర్పల్లి మాజీఎంపిటిసి ఫోరం అధ్యక్షులు మల్లేష్, మాజీ సర్పంచ్ పాండు, యువ నాయకుడు పవన్ ఎమ్మార్వో ని మర్యాదపూర్వకంగా సన్మానించడం జరిగిందని తెలిపారు

# జూన్ 28న 0-5 సంవత్సరాల పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి...

## జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి:జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 25(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/జిల్లాలో జూన్ 28 నుండి 30 వరకు నిర్వహించనున్న పల్స్ పోలియో జాతీయ టీకా కార్యక్రమాన్ని అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు,జిల్లాలో మొత్తం 1,80,405 మంది ఐదేళ్లలోపు చిన్నారులను పల్స్ పోలియో కార్యక్రమం ద్వారా కవర్ చేయడానికి లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు,కార్యక్రమంలో భాగంగా జూన్ 28న 1137 పోలియో బూత్‌ల ద్వారా పోలియో చుక్కలు వేస్తారని 28న పోలియో చుక్కలు వేసుకోని పిల్లలకు జూన్ 29,30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని వెల్లడించారు,దేశాన్ని పోలియో రహితంగా కొనసాగించేందుకు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం అత్యంత కీలకమని పేర్కొన్నారు,తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలను సమీప పోలియో బూత్‌కు తీసుకువెళ్లి పోలియో చుక్కలు వేయించాలని కోరారు,ఈ కార్యక్రమం విజయవంతానికి అన్ని ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, మహిళా సంఘాలు, సామాజిక సంస్థలు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు,జూన్ 28న ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించే పల్స్ పోలియో బూత్‌లకు తమ ఐదేళ్లలోపు పిల్లలను తప్పనిసరిగా తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ తల్లిదండ్రులకు సూచించారు,పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఆరోగ్యవంతమైన భావితరాల నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు.



# రామన్నగూడెం కరకట్టను పరిశీలించిన మంత్రి సీతక్క



**ఎదురు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జూన్ 25 ఏటూరునాగారం**ఏటూరు నాగారం మండలం రామన్నగూడెం వద్ద గోదావరి నది కరకట్ట భద్రత కోసం నూతన సాంకేతికతతో ఏర్పాటు చేస్తున్న జియో ట్యూబ్స్ పనులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా గోదావరి నది ప్రవాహ పరిస్థితులు, కరకట్ట భద్రత, వరదల సమయంలో నది కరకట్ట దెబ్బతినకుండా చేపడుతున్న రక్షణ చర్యలను పరిశీలించిన మంత్రి అనసూయ సీతక్క , సంబంధిత అధికారులను అడిగి మ్యాప్ ఆధారంగా గోదావరి నది ప్రవాహ తీరు, కరకట్ట పరిస్థితులు, జియో ట్యూబ్స్ ఏర్పాటు విధానం, చేపడుతున్న రక్షణ చర్యలపై పూర్తి వివరాలను తెలుసుకున్నారు.

పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేసి గోదావరి పరివాహక ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు మంత్రి సీతక్క దిశ నిర్దేశం చేశారు.

ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, స్థానిక ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు



# అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ చెకప్ క్యాంప్






**మియాపూర్ (ప్రజాబలం ప్రతినిధి నరేష్)జూన్ 25..** అట్టేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో ప్రజల ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఉచిత మెగా మెడికల్ హెల్త్ చెకప్ క్యాంప్ ను మియాపూర్ లోఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం గురువారం నాగసాయి బాబా దేవాలయం, లక్ష్మీనగర్, మియాపూర్ లో నిర్వహించబడింది. ఈ మెగా హెల్త్ క్యాంప్‌లో ప్రజలకు బ్లడ్ ప్రెషర్, రాండమ్ బ్లడ్ షుగర్, హార్ట్ రేట్, బి ఎం ఐ, బాడీ ఫ్యాట్, మసిల్ మాస్, బోన్ మాస్, మెటబాలిక్ ఏజ్, బాడీ వాటర్, విసెరల్ ఫ్యాట్ తదితర పరీక్షలతో పాటు కంటి మరియు దంత వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమానికి విజయ డయాగ్నస్టిక్ సెంటర్, సెంటర్ ఫర్ సైట్, క్లోవ్ డెంటల్ సంస్థలు సహకారం అందించాయి. క్యాంప్‌కు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనలు పొందారు.ఈ సందర్భంగా అట్టేపల్లి రామప్రభు మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇటువంటి సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అట్టేపల్లి పురుషోత్తం , శ్రీరాములు, పార్నంది నాగులు, దయాకర్, శ్రీరామ్ ,కరుణాకర్ లతో పాటు ఏ ర్ పి టీమ్ సభ్యులు, ట్రస్ట్ సభ్యులు, కాలనీ పెద్దలు, యువత మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రజలందరూ ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని నిర్వాహకులు కోరారు.

# విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి.

**-- మెరుగైన ఫిట్ మెంట్ తో పి ఆర్ సి ప్రకటించాలి.**

**-- కలెక్టరేట్ ముందు టి ఎస్ యు టి ఎఫ్ నిరసన ప్రదర్శన**

మహబూబ్ నగర్, గురువారం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ వ్యతిరేక విధానాలు విడనాడాలని, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం నాడు మహబూబ్ నగర్ జిల్లా కలెక్టరేట్ ముందు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్)

ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించడం జరిగింది.

ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కే రవికుమార్ మాట్లాడుతూ విద్యా ప్రైవేటీకరణ ను ప్రోత్సహించే, అశాస్త్రీయ విద్యావిధానాన్ని






అమలు చేసే నూతన జాతీయ విద్యా విధానం-2020 ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల మూసివేతను ఆపివేయలని,అవసరం ఉన్న చోట నూతన పాఠశాలలను తెరవాలని,విద్యాహక్కు చట్టానికి సవరణ చేసి ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి వెంకటేష్ మాట్లాడుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని,పిఆర్సీ రిపోర్ట్ తెప్పించుకుని వెంటనే వేతన సవరణను అమలు చేయాలని,పెండింగ్ డీఏ లను విడుదల చేయాలని, అన్ని రకాల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, పాఠశాలలు లేని ఏరియాలలో కొత్తగా పాఠశాలలను ప్రారంభించాలని, హేతుబద్ధీకరణ పేరుతో పాఠశాలల మూసివేతను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏవో సువర్ణ రాజ్ గారికి మెమోరాండం సమర్పించడం జరిగింది.

ఈ నిరసన కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు ఎం వేణుగోపాల్, ఎం మన్యం,డి అజయ్,ఖాదరయ్య, జి జయంతి, ఎం శ్రీనివాస్, వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు ఎం రాములు, అయూబ్,అక్తర్ హుస్సేన్, సి వెంకటయ్య, కృష్ణ, రాజేశ్వరి, పి రాధ, హనుమంతు నాయక్, బాలచంద్రుడు, ప్రదీప్ కుమార్ రెడ్డి,డి రాధ, గోవర్ధన్, ఎల్లప్ప, ఆంజనేయులు, శంకర్ బాబు, శివకుమార్ తదితరులు లతోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వసతి గృహాల్లో విద్యార్థులను సొంత పిల్లలుగా భావించాలి...

## మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

## విద్యార్థుల భద్రత,ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి:జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖలకు చెందిన అన్ని ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు,గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల వసతి గృహాల్లో వసతి,సౌకర్యాలు, మౌలిక వసతులు, మరమ్మత్తుల అవసరాలు తదితర అంశాలపై కలెక్టర్ సంబంధిత అధికారులు ,సంక్షేమ వసతి గృహ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు,ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన మరియు






ఆహ్లాదకరమైన వాతావరణంలో నాణ్యమైన విద్యను అభ్యసించేలా వసతి గృహాల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అన్ని వసతి గృహాల్లో పరిశు భ్రతను కచ్చితంగా పాటించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందించాలాన్నారు,ప్రతి వసతి గృహంలో స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు, మరుగుదొడ్లు, స్నానాల గదులు, తగిన గాలి, వెలుతురు ఉండేలా చూడాలని తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రతి గదిలో ఫ్యాన్లు,లైట్లు ఏర్పాటు చేయాలని, అవసరమైన మరమ్మత్తులు,తదితరాలకు అంచనా ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు,విద్యార్థులను సొంత పిల్లలుగా భావించి వారి సంక్షేమం, ఆరోగ్యం, విద్యాభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేయాలని హాస్టల్ సంక్షేమ అధికారులకు సూచించారు,ముఖ్యంగా బాలికల వసతి గృహాల్లో మరుగుదొడ్లు, స్నానాలగదులు,తలుపులు,రన్నింగ్ వాటర్, తదితర సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలని, చిన్నచిన్న మరమ్మత్తులు అవసరమైనవాటిని వెంటనే చేపట్టాలని, మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అనుకూలంగా వసతి గృహాల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని తెలిపారు,ఈ సమావేశంలో డీఎస్సీడీవో జగదీష్,జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వెంకటేష్,సహాయ సంక్షేమ అధికారులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల హాస్టల్ వెల్ఫేర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భావితరాలకు డ్రగ్ రహిత సమాజాన్ని అందించాలి

**డ్రగ్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా జిల్లా కలెక్టరేట్ నుంచి ఐబీ వరకు యాంటీ డ్రగ్ డే ర్యాలీ.**

**డ్రగ్ రహిత సంగారెడ్డి జిల్లాను నిర్మించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి : జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్.**

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 25(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి/అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం (జూన్ 26 -యాంటీ డ్రగ్ డే) సందర్భంగా సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుంచి ఐబీ వరకు మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిర్మూలనే లక్ష్యంగా వివిధ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థిని,విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు,ఈ ర్యాలీలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఐఏఎస్ జిల్లా ఎస్పీ పరితోష్






పంకజ్, ఐపీఎస్. ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు,ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మాదకద్రవ్యాలను తయారు చేయకపోయినా వాటిని వినియోగించడం ద్వారా ఎంతోమంది యువత వాటి బారిన పడుతున్నారని అన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు తెలంగాణ రాష్ట్ర ఈగల్ టీం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు, ఆదేవిదంగా జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్ ల పరిదిలో విద్యాసంస్థల ఆధ్వర్యంలో ర్యాలీలు, మానవహారాలు నిర్వహించి, ప్రతి ఒక్కరూ యాంటీ డ్రగ్ సోల్జర్ గా ఉండాలని ప్రతిజ్ఞ చేయించినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసై అనేక మంది యువత తమ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. యువత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రగ్స్‌కు బానిసలు కాకూడదని సూచించారు,యువత మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, సంగారెడ్డి జిల్లాను డ్రగ్ ఫ్రీ జిల్లాగా మార్చే వరకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, భావితరాలకు డ్రగ్ రహిత సమాజాన్ని అందించాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు,జిల్లాలో ఎక్కడైనా గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల విక్రయం, అక్రమ రవాణా లేదా వినియోగం జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే జిల్లా ఎస్-న్యాబ్ హెల్ప్‌లైన్ నంబర్ 8712656777కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ర్యాలీలో పాల్గొన్న అన్ని విద్యాసంస్థల యాజమాన్యాలకు, అధ్యాపకులకు, విద్యార్థినులు, విద్యార్థులకు జిల్లా ఎస్పీ అభినందనలు తెలిపారు,అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లాను డ్రగ్ ఫ్రీ జిల్లాగా మార్చడంలో గ్రామస్థాయి నుంచే సంకల్పంతో ముందుకు రావాలని అన్నారు. మాదకద్రవ్యాలకు బానిసైన వారు హీరోలు కాదని, వారు అత్యంత బలహీన స్థితిలో ఉన్న వ్యక్తులని పేర్కొన్నారు. అలాంటి వారిని తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడం మనందరి బాధ్యత అని అన్నారు,స్నేహితులు చెడు అలవాట్ల వైపు ప్రోత్సహించినా, కుటుంబ సభ్యులు మనపై ఉంచిన నమ్మకాన్ని, జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యాన్ని ఎప్పటికీ మరువకూడదన్నారు,యాంటీ డ్రగ్ డే సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులు, విద్యార్థులు “నో టూ డ్రగ్స్ యస్ టూ లైఫ్” అనే నినాదంతో ప్రతిజ్ఞ చేసి తమ చుట్టుపక్కల ఉన్నవారికి కూడా మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సూచించారు,ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్.,అదనపు కలెక్టర్ పాండు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థినులు, విద్యార్థులు, యువత భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు శాతం పెంచాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, జూన్-25, ప్రజాబలం ప్రతినిధి::** జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు వారికి నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సీపీడీవోలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు నమోదును పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరయ్యే ప్రతి చిన్నారికి నాణ్యమైన భోజనం, పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భిణులు, బాలింతలకు పాలు, కోడిగుడ్లు తదితర పోషకాహారాన్ని నిబంధనల ప్రకారం క్రమం తప్పకుండా అందించాలని తెలిపారు. గర్భిణీ మహిళలు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి అక్కడే భోజనం చేసే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, వారికి పాలు, కోడిగుడ్లు తదితర పోషకాహారాన్ని నిబంధనల ప్రకారం క్రమం తప్పకుండా అందించి మాతా, శిశు ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. బాలింతలకు కూడా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సకాలంలో అందేలా పర్యవేక్షించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ సూచించారు. చిన్నారులకు నాణ్యమైన ప్రాథమిక విద్యతో పాటు ఆటపాటల ద్వారా అభ్యాసం జరిగేలా అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పిల్లలకు అవసరమైన ఆట వస్తువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే ఆహార పదార్థాలను తప్పనిసరిగా తనిఖీ చేసి నాణ్యతను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. చిన్నారులకు బాలామృతంతో పాటు అందించాల్సిన అన్ని పౌష్టికాహార పదార్థాలు సక్రమంగా అందేలా పర్యవేక్షించాలని సూచించారు. జులై 1న అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిదండ్రుల సమక్షంలో సమావేశాలు నిర్వహించి, పిల్లల ఆరోగ్యం, పోషకాహారం, హాజరు, విద్యాభివృద్ధిపై వారి సూచనలు, సలహాలు స్వీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. పిల్లల బరువును క్రమం తప్పకుండా నమోదు చేసి ఎదుగుదలను పర్యవేక్షించాలని, పోషకాహార లోపం ఉన్న చిన్నారులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి కాళిందిని , సీపీడీవోలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com